Crime Mirror QR Code
https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

హైదరాబాద్
24-12-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక:42

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## మరో రూ.2,723 కోట్ల పనులు

### రాజధానిలో జోన్ 7, 10 లేఅవుట్లలో రోడ్ల నిర్మాణం..

- సీఆర్డీఏ అథారిటీ ఆమోదం
- 15లోపు పనులన్నిటికీ టెండర్లు
- వెంటనే నిర్మాణ పనులు మొదలు
- అమరావతి వ్యయం ప్రజలపై వేయం
- రాజధానిపై వైసీపీకి ఇంకా కక్ష తీరలేదు
- రుణమివ్వొద్దని ప్రపంచబ్యాంకుకు లేఖలు
- మంత్రి పి.నారాయణ ఆగ్రహం

అమరావతి: రాజధాని అమరావతిలో రూ.2,723 కోట్లతో ఎల్‌పీఎస్ జోన్-7, జోన్-10 లేఅవుట్ల రోడ్ల నిర్మాణ పనులు, మౌలిక వసతులు కల్పించేందుకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం తెలిపింది. దీంతో ఇప్పటి వరకు రాజధాని అభివృద్ధికి సంబంధించి రూ.47,288 కోట్ల విలువైన పనులకు ఆమోదముద్ర వేసినట్లయింది. సోమవారమిక్కడ రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన అథారిటీ 44వ సమావేశం జరిగింది.

2లో

యాసంగి నుంచి రైతు భరోసా అమలుకు సర్కారు నిర్ణయం

యాంత్రీకరణ పథకంతో సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

కొత్త రేషన్ కార్డుల పంపిణీ కూడా సంక్రాంతి నుంచే

30న మంత్రివర్గ సమావేశం.. కీలక నిర్ణయాలకు ఆమోదం!

గడిచిన ఏడాదిలో రుణమాఫీకి ప్రాధాన్యమిచ్చిన ప్రభుత్వం

## సంక్రాంతికి వస్తున్నాం!

### రైతుల ముంగిట్లోకి రెండు వ్యవసాయ సంక్షేమ పథకాలు



హైదరాబాద్: తొలి ఏడాది పాలనలో రుణమాఫీ పథకం అమలుకు పూర్తి ప్రాధాన్యమిచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. రెండో సంవత్సరంలో రైతులకు సంబంధించిన ఇతర వ్యవసాయ సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించింది. సంక్రాంతి పండుగకు రైతు భరోసా, యాంత్రీకరణ పథకాలను రైతుల ముంగిట్లోకి తీసుకొస్తోంది. రేషన్ కార్డులు లేనివారికి కొత్త కార్డులు పంపిణీ చేసే పథకాన్ని కూడా సంక్రాంతి నుంచే అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నెల 30న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ భేటీలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.

2లో

## ఉరికొయ్యలు.. చెరసాలలు!

ఇందిరమ్మ రాజ్యంలో రైతులకు మిగిలిందివే!

కాంగ్రెస్ పాలనలో అన్నదాతల ఆక్రందనలు

ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనకుండా అరిగోస పెడుతున్న సర్కార్

బోనస్ దేవుడెరుగు.. ధాన్యం కొనే దిక్కేలేదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో





## అందాల దీవిలో కడలి కల్లోలం

చిన్నగొల్లపాలెం కొబ్బరి తోటలను మింగేస్తున్న కడలి తరంగాలు

తుపాను వచ్చిందంటే గ్రామస్తులకు హడలే

ఇప్పటికే సముద్రంలో కలిసిపోయిన 800కు పైగా ఎకరాలు

కోత ప్రదేశంలో రాతి కట్టడం నిర్మించాలంటున్న ప్రజలు

## విచారణకు రండి..

### ఉదయం 11 గంటలకు రావాలని అల్లు అర్జున్‌కు పోలీసుల నోటీసు

నేటి నుంచి రోజువారీ విచారణ?

బడ్జెట్ పెరిగితే టికెట్ రేట్లు పెంచాలి

సీఎంను కలిసే అంశంపై దిల్ రాజు

వచ్చాక నిర్ణయం: నిర్మాత నాగవంశీ

ధరల పెంపు మధ్యతరగతికి భారం

ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

ఏపీ ప్రభుత్వమూ ఇలాగే చెయ్యాలి

ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ప్రకటన

శ్రీతేజ్‌కు 'పుష్ప' నిర్మాతల పరామర్శ

కోమటిరెడ్డితో కలిసి ఆస్పత్రికి వెళ్లి అతడి తండ్రికి రూ.50 లక్షల చెక్



హైదరాబాద్ మధ్యంతర బెయిల్‌పై ఉన్న నటుడు అల్లు అర్జున్‌కు చిక్కడపల్లి పోలీసులు నోటీసులు జారీ చేశారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై మరింత లోతైన దర్యాప్తు చేసేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు హాజరు కావాల్సిందిగా ఆ నోటీసులో పేర్కొన్నారు. తొక్కిసలాటలో రేవతి అనే మహిళ చనిపోగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు 18 మంది మీద కేసులు నమోదు చేశారు. అల్లు అర్జున్‌ను 11వ నిందితుడిగా చేర్చారు. అయన్ను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయస్థానం రిమాండు విధించింది. అల్లు అర్జున్ దీనిపై హైకోర్టును ఆశ్రయించగా రూ.50 వేల వ్యక్తిగత పూచీకత్తుతో హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

2లో

## పెట్టుబడులకు రాష్ట్రం అనుకూలం

మలేషియా వ్యాపారవేత్తలతో మంత్రి శ్రీధర్‌బాబు



2లో



## గత ఏడాదిన్నరలో.. 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం

వీరిలో అత్యధిక మంది మహిళలే.. ఇదో రికార్డు: ప్రధాని మోదీ

ఢిల్లీ రోజ్‌గార్ మేళాలో 71 వేల మందికి నియామక పత్రాలు

2లో

## దిగంతాలకు సమాంతర సినీమాంత్రికుడు..

### దర్శక దిగ్గజం శ్యామ్ బెనెగల్ కన్నుమూత

కిడ్నీ సంబంధిత వ్యాధితో ముంబైలో తుదిశ్వాస

హైదరాబాద్‌లో జననం

భారతీయ సినిమాకు ప్రపంచ ఖ్యాతి తీసుకొచ్చిన దర్శకుడు

పద్మభూషణ్, ఫాల్కే అవార్డులతో

గౌరవించిన కేంద్ర ప్రభుత్వం

తెలుగు చిత్రం అనుగ్రహంకు దర్శకత్వం






# అందాల దీవిలో కడలి కల్లోలం

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడ: సహజసిద్ధ ప్రకృతి అందాలతో కనువిందు చేసే సుందర ద్వీపం చిన్నగొల్లపాలేనికి కష్టం వచ్చింది. దీనిని కడలి ఏటా మింగేస్తోంది. మరికొన్నేళ్లు గడిస్తే దీవి అనవాళ్లు కనబడవేమో అనే బెంగ ఆ గ్రామ వాసులను పీడిస్తోంది. మూడువైపులా ఉప్పుటేర్లు, ఒకవైపు బంగాళాఖాతం ఉండటంతో చుట్టూ నీటితో నిండిన చినగొల్లపాలెం కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలంలో ఉంది. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలకు సరిహద్దులో రెండు జిల్లాల సంస్కృతికి అద్దం పడుతూ భౌగోళికంగానే కాక జీవన విధానంలోనూ భిన్న సంస్కృతికి నిలువెత్తు నిదర్శనంగా చినగొల్లపాలెం నిలుస్తోంది. 1962వ సంవత్సరానికి ముందు దీవి మూడువైపులా నీటితో ఒక వైపు భూభాగంతో ద్వీపకల్పంగా ఉండేది. 1962లో కొల్లేరు పరీవాహక ప్రాంత ముంపునీరు సముద్రంలో కలిసేందుకు చినగొల్లపాలెం, పడతడిక గ్రామాల మధ్య కాలువ తవ్వారు. అప్పటి నుంచి ఇది మానవ నిర్మింత దీవిగా మారిపోయింది. నాటినుంచి దాదాపు అర్ధ శతాబ్దంపాటు బాహ్య ప్రపంచంతో రవాణా సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. జల రవాణా మాత్రమే ఉండటంతో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉప్పుటేరుపై వారధి నిర్మాణం జరిగింది. దీంతో రవాణా సంబంధాలు పునరుద్ధరణకు నోచుకున్నాయి.

# పెట్టుబడులకు రాష్ట్రం అనుకూలం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో పెట్టుబడుల కోసం తెలంగాణలో అత్యంత అనుకూల వాతావరణం ఉందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని మలేషియా పారిశ్రామికవేత్తలను కోరారు. శ్రీధర్‌బాబు గత నెలలో మలేషియా తెలుగు మహాసభలకు హాజరైన సందర్భంగా అక్కడి పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి ఆహ్వానించారు. ఈ మేరకు పలువురు పారిశ్రామికవేత్తలు రాష్ట్ర పర్యటనకు వచ్చారు. మలేషియా తెలంగాణ అసోసియేషన్ చొరవతో సోమవారం సచివాలయంలో మలేషియా వాణిజ్య ప్రతినిధులతో మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సౌర విద్యుత్ రంగం, డ్రైపోర్టుల నిర్మాణం, మురుగు నీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటు, మహిళా పారిశ్రామికవేత్తలు, అంకుర సంస్థలకు విదేశాల్లో మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంపై చర్చించారు.

# దిగంతాలకు సమాంతర సినీమాంత్రికుడు..

(మొదటి పేజీ తరువాయి)

ముంబై/హైదరాబాద్: ప్రముఖ సినీ దర్శకుడు శ్యామ్ బెనెగల్ సోమవారం కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న 90 సంవత్సరాల శ్యామ్ బెనెగల్ సోమవారం సాయంత్రం ముంబైలోని వోడ్‌హార్డ్ దవాఖానలో తుది శ్వాస విడిచినట్టు ఆయన కుమార్తె పియా బెనెగల్ ధ్రువీకరించారు. ఆయనకు భార్య నీనా బెనెగల్, కుమార్తె ఉన్నారు. అంకుర్, భూమిక, జునూన్, కలియుగ్, ఆరోహన్, త్రికాల్, సుస్మాన్, అంతర్‌నాద్, మండి, మంథన్ తదితర అనేక అవార్డు చిత్రాలకు శ్యామ్ బెనెగల్ దర్శకత్వం వహించారు. 1978లో వాణిశ్రీ, అనంతనాగ్‌లతో ఆయన తీసిన ఏకైక తెలుగు చిత్రం అనుగ్రహం 1979 బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు నోచుకుని విమర్శకుల ప్రశంసలు అందుకుంది. డిసెంబర్ 14న ఆయన మిత్రులు, కుటుంబ సభ్యులతో కలసి తన 90వ పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. 1976లో పద్మశ్రీ అవార్డు, 1991లో పద్మ భూషణ్ అవార్డుతో భారత ప్రభుత్వం ఆయనను గౌరవించింది. ఆయన దర్శకత్వం వహించిన విజయవంతమైన చిత్రాలలో మంథన్, జుబేదా, సర్దారీ బేగం కూడా ఉన్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ రచించిన డిస్కవరీ ఆఫ్ ఇండియా ఆధారంగా దూరదర్శన్ కోసం ఆయన రూపొందించిన భారత్ ఏక్ ఖోజ్ డాక్యుమెంటరీ దేశవ్యాప్తంగా ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. 1934 డిసెంబర్ 14న హైదరాబాద్‌లో జన్మించిన శ్యామ్ బెనెగల్ కొంకణీ మాట్లాడే చిత్రపూర్ సారస్వత్ బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు. కర్ణాటకకు చెందిన శ్యామ్ బెనెగల్ తండ్రి శ్రీధర్ బీ బెనెగల్ ఫొటోగ్రాఫర్ కావడంతో కెమెరా పట్ల శ్యామ్‌కు చిన్నప్పటి నుంచే ఆసక్తి ఏర్పడింది. తన 12వ ఏట తన తండ్రి బహుమతిగా ఇచ్చిన కెమెరాతో శ్యామ్ బెనెగల్ తన మొదటి చిత్రాన్ని తీశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ పొందిన ఆయన హైదరాబాద్ ఫిల్మ్ సొసైటీని స్థాపించి తన సినీ ప్రయాణానికి బాటలు వేసుకున్నారు. ఆయన దర్శకత్వం వహించిన చిత్రాలలో అంకుర్, మంథన్, మండి, నేతాజీ సుభాష్ చంద్ర బోస్: ది ఫర్‌గాటెన్ హీరో, జుబేదా, వెల్ డన్ అబ్బా వంటివి అంతర్జాతీయంగా పేరు గడించాయి. ఆయన దర్శకత్వం వహించిన అనేక చిత్రాలు జాతీయ అవార్డులను గెలుచుకున్నాయి.

# గత ఏడాదిన్నరలో.. 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ: కేంద్రంలోని ఎన్‌డీయే ప్రభుత్వం గత ఏడాదిన్నర కాలంలో 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందని ప్రధాని మోదీ తెలిపారు. ఇదో రికార్డు అని.. ఇంతవరకు ఏ సర్కారూ ఇన్ని ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాల్లేవని చెప్పారు. సోమవారమిక్కడ 'రోజ్‌గార్ మేళా'కు ఆయన వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 71 వేల మందికిపైగా నియామక పత్రాలు అందజేశారు. తన ప్రభుత్వ పాలసీలు, కార్యక్రమాలన్నీ యువత కేంద్రకంగానే ఉన్నాయని ప్రధాని చెప్పారు. రోజ్‌గార్ మేళాలతో వారికి సాధికారత లభిస్తోందని.. వారి సామర్థ్యం వెలికివస్తోందని అన్నారు. 'పది లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు పొందినవారిలో అత్యధికులు మహిళలే. అతివలు తమ కాళ్లపై తాము నిలబడేలా చేసేందుకు మా ప్రభుత్వం కృషిచేస్తోంది. 26 వారాలు మాతృత్వ సెలవులివ్వాలన్న నిర్ణయం వారి కెరీర్లకు ఎంతో ఉపకరిస్తోంది. ప్రధాని ఆవాస్ యోజన కింద నిర్మించే ఇళ్లకు వారే యజమానులు. దేశంలో వారి నేతృత్వంలోనే అభివృద్ధి సాగుతోంది.

# సంక్రాంతికి వస్తున్నాం!

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవలి అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో చర్చించిన అంశాలతోపాటు మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, కొన్ని కొత్త సంక్షేమ పథకాలు కూడా సంక్రాంతి నుంచి అమల్లోకి రానున్నాయి. మొదటి సంవత్సరం వ్యవసాయ రంగంలో కీలకమైన రుణమాఫీ పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన విషయం తెలిసిందే. నాలుగు విడతల్లో 25.36 లక్షల మంది రైతులకు రూ.20,617 కోట్ల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. దీంతో పాటు ఏడాదిలో ఒక విడత రైతుబంధు నిధులు కూడా విడుదల చేసింది. కేసీఆర్ ప్రభుత్వం 2023-24 సంవత్సరంలో ఒక పంటకు రైతుబంధు ఇచ్చి, రెండో పంటకు ఎగ్గొట్టిందని, తాము తొలి ఏడాదిలో ఒక పంటకు పాతలెక్క ప్రకారం ఎకరానికి రూ.5 వేల చొప్పున రూ.7,500 కోట్లు రైతుబంధు ఇచ్చామని రేవంత్ సర్కారు వెల్లడించింది. ఇక రైతు భరోసా విధి విధానాలు ఖరారు చేసి రెండో పంటకు ఎకరానికి రూ.7,500 చొప్పున పంపిణీ చేస్తామని ప్రకటించింది.

ఉపసంఘం నివేదిక రాగానే రైతు భరోసా..

రైతు భరోసా పథకాన్ని సంక్రాంతికి అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాజాగా ప్రకటించిన విషయం విదితమే! శాసనసభ, శాసనమండలిలో ఇటీవల రైతు భరోసాపై చర్చ కూడా పెట్టారు. దీనిపై ప్రతిపక్ష పార్టీల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క నేతృత్వంలో ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘం కొన్ని జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేసింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని.. ఒకటి, రెండు సార్లు ఉపసంఘం భేటీ నిర్వహించి తుది నివేదిక ఇవ్వనుంది. అనంతరం దానిపై రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించి ఆమోదించనున్నారు. మార్గదర్శకాలు ఖరారు చేసి... ఉత్తర్వులు జారీచేయనున్నారు. జనవరి 10 లోగా ఈ ప్రక్రియను పూర్తిచేయనున్నారు. అయితే యాసంగి సీజన్ ఇప్పుడిప్పుడే ప్రారంభమైంది. రైతులు వరి నార్లు పోశారు. అక్కడక్కడ నాట్లు వేస్తున్నారు. ఆరుతడి పంటలు సాగుచేసే రైతులు ఇప్పటికే విత్తనాలు వేశారు. ఈ నేపథ్యంలో విధి విధానాలు ఖరారుచేసి.. యాసంగి సాగు ఊపందుకోకముందే.. రైతుభరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో ఎకరానికి రూ. 5 వేలు చెల్లించగా... ఇప్పుడు 50 శాతం పెంచి, ఎకరానికి రూ. 7,500 చొప్పున పంపిణీ చేయనున్నారు. అంటే రెండు పంటలకు కలిపి ఏడాదికి ఎకరానికి రూ.15 వేలు రైతుభరోసా పథకంలో చెల్లిస్తారు. సంక్రాంతి నుంచి ఈ పథకం అమలులోకి వస్తుండటం గమనార్హం.

**యాసంగి నుంచి వ్యవసాయ యాంత్రీకరణ**

కేసీఆర్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రాగానే... వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని నిలిపివేసింది. 2018 నుంచి 2023 వరకు రైతులకు ఏ పనిముట్లు కూడా సబ్సిడీపై పంపిణీ చేయలేదు. విత్తన సబ్సిడీలను కూడా ఎత్తివేసింది. కేవలం రైతుబంధు, రైతుబీమా పథకాలకే పరిమితమైంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ యాసంగి సీజన్ నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలుచేయాలని నిర్ణయించింది. కేంద్రప్రభుత్వ మద్దతుతో యాంత్రీకరణ పథకాన్ని అమలుచేయనుంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(ఆర్‌కేవీవై) పథకంలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం ఆర్థిక సాయం చేస్తోంది. 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు చెల్లిస్తే సరిపోతుంది. ఈమేరకు 2024- 25 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం రూ.26 కోట్లు కేటాయించింది.

# విచారణకు రండి..

(మొదటి పేజీ తరువాయి)



అనంతరం.. ఈ దుర్ఘటనకు ప్రధాన కారణం అల్లు అర్జునేనని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో.. అదే రోజు సాయంత్రం అల్లు అర్జున్ పత్రికా సమావేశం నిర్వహించి, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పిన విషయం విదితమే. అసలు రేవతి మరణం గురించి తనకు మర్నాటిదాకా తెలియదని.. ఆరోజు రాత్రి థియేటర్‌లో పోలీసులు తనవద్దకు రాలేదని బన్నీ చెప్పగా.. థియేటర్ నుంచి ఆరోజు రాత్రి ఆయన్ను తాము దగ్గరుండి బయటకు తీసుకువస్తున్న దృశ్యాలను పోలీసులు మీడియాకు విడుదల చేశారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో.. అల్లు అర్జున్‌ను పోలీసులు విచారణకు పిలవడం గమనార్హం. జరిగిన దుర్ఘటన గురించి మర్నాడు ఉదయం వరకూ తనకు తెలియదని అల్లు అర్జున్ చెప్పిన నేపథ్యంలో.. ఆయన్ను ఎంతసేపు విచారిస్తారు? ఏయేప్రశ్నలు అడిగే అవకాశం ఉందనే అంశం ఆసక్తికరంగా మారింది. కాగా.. ఈ కేసు విషయమై పోలీసులు అల్లు అర్జున్‌ను మంగళవారం ఒక్కరోజే కాక.. రోజూ విచారణకు పిలిచే అవకాశం ఉందని విశ్వసనీయవర్గాల సమాచారం. సంధ్య థియేటర్ దుర్ఘటన నేపథ్యంలో బెనిఫిట్ షోలకు, టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇవ్వబోమని సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో దీనిపై ఫిలిం చాంబర్ సోమవారం కీలక సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు హాజరై చర్చించారు. ఇకపై బెనిఫిట్ షోలకు అనుమతులు ఇవ్వబోమని.. టికెట్ రేట్లు పెంచబోమని అంటే ఎలా అని నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేశారు. "సినిమాకు అనుకున్న బడ్జెట్‌కు మించి ఖర్చు అయినప్పుడు మాత్రమే టికెట్ రేట్లు పెంచాలని అడుగుతాం తప్ప.. ప్రతి సినిమాకూ అడగం" అని నిర్మాత నాగవంశీ అన్నారు. దీనిపై సీఎంను కలిసే ఆలోచన ఏమైనా ఉందా అని విలేకరులు ప్రశ్నించగా.. ఫిలిం డెవల్‌పమెంట్ కార్పొరేషన్ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్‌రాజు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారని, ఆయన ఇక్కడికి వచ్చాక ముందు ఆయనతో సమావేశమై తదుపరి కార్యాచరణ నిర్ణయిస్తామని నాగవంశీవెల్లడించారు. సినిమా ఇండస్ట్రీ ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోదని ఆయన పేర్కొన్నారు. కాగా.. టికెట్ రేట్ల పెంపుపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ చైర్మన్ విజేందర్ రెడ్డి ప్రకటించారు. "సినిమా టికెట్ ధరలను పెంచడం వల్ల ప్రేక్షకులు కన్‌ఫ్యూజ్ అవుతున్నారు. పెరిగిన టికెట్ రేట్లతో మధ్య తరగతి ప్రేక్షకులు, విద్యార్థులు సినిమాలకు రాలేకపోతున్నారు. ఇది కలెక్షన్లపైనా ప్రభావం చూపుతోంది. టిక్కెట్ ధరలపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం" అని ఆయన చెప్పారు. "తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లే ఏపీ ప్రభుత్వమూ బెనిఫిట్ షోస్, టికెట్ ధరలు పెరగకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుంది" అని ఆంధ్రప్రదేశ్ ఎగ్జిబిటర్స్ సెక్టార్ చైర్మన్ ఎస్.రామ్ ప్రసాద్ అన్నారు. "తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచి పరిణామం. సినిమాను ఎక్కువ థియేటర్స్‌లో విడుదల చేయడం ఎలా అనే దానిపై నిర్మాతలు దృష్టి పెట్టాలి" అని ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సెక్రటరీ బాలగోవింద్ రాజ్ సూచించారు. టీఎఫ్‌పీసీ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ కూడా.. టికెట్ ధరలపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం వల్ల చిన్న సినిమాలకు మంచి జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. "పెద్ద సినిమాలకు టిక్కెట్ రేట్లు పెంచడం వల్ల చిన్న చిత్రాలపై భారం పడుతోంది. ఏడాదికి రిలీజయ్యే చిత్రాల్లో చిన్న చిత్రాలే 90 శాతం ఉన్నాయి. కేవలం 10 శాతం మాత్రమే పెద్ద చిత్రాలు ఉంటున్నాయి. చిన్న చిత్రాలకు డిజిటల్ రైట్స్ విషయంలో యూఎఫవో క్యూబ్ ధరలు అధికంగా ఉన్నాయి. మిగతా రాష్ట్రాలో రూ.1500 ఉంటే మన దగ్గర పది వేలు వారానికి వసూలు చేస్తున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**నిర్మాతల సాయం..**

సంధ్య థియేటర్ ఘటనలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను 'పుష్ప-2' నిర్మాతలు నవీన్ యెర్నేని, రవిశంకర్.. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలసి పరామర్శించారు. అతడి తండ్రికి రూ.50 లక్షల చెక్కు అందజేశారు. బాలుడికి అందిస్తున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. "ఇక ఈ విషయాన్ని రాజకీయం చెయ్యొద్దు. సినీ హీరోల ఇళ్లపై దాడులు చెయ్యొద్దు. శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నా" అన్నారు. సినీ పరిశ్రమ విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని, పరిశ్రమ ఎక్కడికీ వెళ్లడం లేదని.. వదంతులను ఎవరూ నమ్మొద్దని ఆయన స్పష్టం చేశారు. అల్లు అర్జున్ ఇంటిపై ఓయూ జేఏసీ నేతల దాడిని ఆయన ఖండించారు. దాడులు చేస్తే చట్టం ఊరుకోదని మంత్రి హెచ్చరించారు. కాగా.. తొక్కిసలాటలో గాయపడ్డ శ్రీతేజ్ ఆరోగ్యం నిలకడగా ఉందని.. అతడు క్రమంగా కోలుకుంటున్నాడని, జ్వరం తగ్గుముఖం పడుతోందని కిమ్స్ ఆస్పత్రి వైద్యులు హెల్త్ బులెటిన్ ద్వారా తెలిపారు.

# మరో రూ.2,723 కోట్ల పనులు

అమరావతి అభివృద్ధి పనులు, టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఈ సందర్భంగా పలు నిర్ణయాలు తీసుకున్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆ తర్వాత మీడియాకు తెలిపారు. మిగిలిన పనుల్లో మరి కొన్నింటికి ఈ నెలాఖరులోపు, ఇంకా మిగిలే పనులకు వచ్చే నెలలో ఆమోదం తీసుకుని.. వచ్చే నెల 15వ తేదీలోపు అన్ని పనులకూ టెండర్లు పిలుస్తామన్నారు. వెంటనే పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. రాజధాని అమరావతి అభివృద్ధికి చేసే ఖర్చు భారాన్ని ప్రజలపై ఒక్క పైసా కూడా వేయబోమన్నారు. భూసమీకరణ ద్వారా రైతుల నుంచి సేకరించిన భూముల అమ్మకం, సంపద సృష్టితో వచ్చే సొమ్ముతోనే.. అమరావతి నిర్మాణానికి తీసుకునే రుణాలను తీర్చుతామని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలకు తావు లేదని.. దీనిపై ఎవరు విమర్శలు చేసినా ప్రజలు నమ్మవద్దని కోరారు. వైసీపీ నేతలకు ఇంకా అమరావతిపై కక్ష తీరనందునే సొంత పత్రికలో విష ప్రచారం సాగిస్తున్నారని, రాజధాని నిర్మాణానికి రుణం ఇవ్వొద్దని వరల్డ్ బ్యాంక్‌కు లేఖలు రాశారని మండిపడ్డారు. చరిత్రలో లేనంత వరద ఇటీవల వచ్చినా అమరావతికి ఇబ్బంది రాలేదని.. వరదలను తట్టుకునేలా రాజధాని నిర్మాణం జరుగుతుందని తెలిపారు.

**కేంద్ర సంస్థలను సమానంగా పంచాం**

రాష్ట్రంలోని 26 జిల్లాల సమగ్రాభివృద్ధికి 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టిందని మంత్రి నారాయణ గుర్తుచేశారు. పునర్విభజనలో ఏపీకి వచ్చిన కేంద్ర సంస్థలను అన్ని జిల్లాలకు సమానంగా కేటాయించామని చెప్పారు. విజయనగరం జిల్లాకు గిరిజన విశ్వవిద్యాలయం, విశాఖ జిల్లాకు ఐఐఎం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ, కాకినాడలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్, తాడేపల్లిగూడెంలో నిట్, మంగళగిరికి ఎయిమ్స్, విజయవాడలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, తిరుపతిలో ఐఐటీ, ఐజర్, కర్నూలులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్, అనంతపురానికి సెంట్రల్ యూనివర్సిటీ కేటాయించినట్లు చెప్పారు. విశాఖలో టీసీఎస్, గూగుల్‌తో పాటు గత ప్రభుత్వం తరిమేసిన లులూను మళ్లీ తీసుకొస్తున్నామని, కర్నూలులో 350 ఎకరాల్లో డ్రోన్ హబ్ ఏర్పాటు చేస్తామని, రాయలసీమ జిల్లాల్లో మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోర్టులు అభివృద్ధి చేస్తామని, పోర్టు అభివృద్ధి అయ్యే ప్రతి చోటా అమరావతి తరహాలో ల్యాండ్ పూలింగ్ ద్వారా శాటిలైట్ సిటీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వచ్చే ఏడాది జూన్ 12కల్లా 1.18 లక్షల టిడ్కో గృహాలను పూర్తి చేసి, ప్రారంభిస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు.

# ఉరికొయ్యలు.. చెరసాలలు!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: ఇందిరమ్మ రాజ్యంలో రైతన్నకు ఉరికొయ్యలు, చెరసాలలే మిగిలాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఎక్కడ చూసినా అన్నదాతల ఆక్రందనలే కనిపిస్తున్నాయని సోమవారం ఎక్స్ వేదికగా ఆయన వాపోయారు. ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న రైతుల ఫొటోలను జత చేస్తూ ట్వీట్ చేశారు. జాతీయ రైతు దినోత్సవం రోజున ఇలాంటి దుస్థితిని చూడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే కొనుగోలు చేయకుండా ప్రభుత్వం అన్నదాతలను అరిగోస పెడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారం కోసం అడ్డగోలు హామీలు, అధికారం దక్కిన తర్వాత అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. క్వింటాల్‌కు రూ.500 బోనస్ దేవుడెరుగు.. కనీసం మార్కెట్‌కు వచ్చిన ధాన్యాన్ని కొనే దిక్కు లేదు అని ధ్వజమెత్తారు. 'రుణమాఫీ కాదు.. రైతు భరోసా రాదు.. అప్పులు తెచ్చి తిప్పలు.. కొనుగోళ్లకు పాతర, దళారుల జాతర' అంటూ కాంగ్రెస్ సర్కార్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. తెలంగాణలో ఏ రైతు బిడ్డా ధైర్యం కోల్పోవద్దని, పోరాటాలు మనకు కొత్తేం కాదని, కాంగ్రెస్ కుట్రలపై కలిసికట్టుగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. భారతదేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తెలంగాణలో పుట్టడం మనందరికీ గర్వకారణమని కేటీఆర్ కొనియాడారు. పీవీ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. గడ్డు కాలంలో దేశానికి ప్రధానిగా సేవలందించిన పీవీ, ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని కాపాడి తన పాలనతో ఆధునిక భారతానికి బాటలు వేశారని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత పీవీ నరసింహారావును బీఆర్ఎస్ ప్రభుత్వం సముచితంగా గౌరవించిందని వెల్లడించారు. పీవీ శత జయంతి ఉత్సవాలను కేసీఆర్ ప్రభుత్వం ఘనంగా నిర్వహించిందని, నెక్లెస్ రోడ్డుకు పీవీ మార్గ్ అని పేరు పెట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని, వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరు పెట్టడమే కాకుండా భారతరత్న ఇవ్వాలని కేంద్రానికి తీర్మానం పంపిందని, పీవీ కూతురును ఎమ్మెల్సీగా నియమించి గౌరవించిందని గుర్తుచేశారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి కుటుంబ సభ్యులకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

# చెరువుల అక్రమణలపై హైడ్రా కమీషనర్ ఆగ్రహం

## సంబంధిత శాఖలతో పూర్తిస్థాయి విచారణకు ఆదేశం



**గండిపేట్(క్రైం మిర్రర్):** ఓఆర్ఆర్‌కు చేరువుగా ఉన్న పలు చెరువులను సోమవారం హైడ్రా కమీషనర్ ఏ.వి.రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువుల అక్రమణలపై ప్రజలతో పాటు ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీలు చేపట్టారు. నానక్‌రామ్‌గూడకు చేరువలో ఉన్న తౌతానికుంట, భగీరథమ్మ చెరువు, నార్సింగిలోని నెక్నాంపూర్ చెరువుల అక్రమణలపై కమీషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తౌతానికుంట, భగీరథమ్మ చెరువుల అక్రమణలతో పాటు ఆయా చెరువుల్లోకి వరద నీరు చేరకుండా కాలువలను మళ్లించడం, మూసీ వేయడంపై రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండిఏ అధికారులతో క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర నివేధిక సమర్పించాలని ఆదేశించారు. చెరువులో మట్టిపోయడంతో పాటు ఆఖరుకు వరద కాలువలను కూడా కనిపించకుండా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. మౌలానా ఆజాద్ నేషనల్ యూనివర్సిటీ ఖాళీ స్థలంలో వర్షపు నీరు వెళ్లే రహదారులు మూసుకుపోవడంతో తమ అపార్ట్‌మెంట్‌లోకి వరద నీరు వచ్చి చేరుతుందని స్థానికులు వివరించారు. నానక్‌రామ్‌గూడ ప్రధాన రహదారికి ఎగువున ఉన్న తౌతానికుంట చెరువు నీరు దిగువవైపు ఉన్న భగీరథమ్మ చెరువుకు వెళ్లే కాలువ లింకు తెగిందన్నారు. నానక్‌రామ్‌గూడకు ఉన్న ఇరువైపులా వరద నీటి కాలువలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు, దుకాణాలను తొలగించాలని అధికారులకు సూచించారు. యూనివర్సిటీ ఖాళీ స్థలంలోంచి వరద నేరుగా తౌతానికుంటకు, తర్వాత భగీరథమ్మ చెరువుకు చేరితే ఈ ఇబ్బంది తొలుగుతుందని స్థానికులు విజ్ఞప్తి చేశారు. చెరువులకు ఆనుకోని ఉన్న స్థలాలు తమవంటూ పలువురు కమీషనర్‌ను కలువగా పూర్తి వివరాలను హైడ్రాకు సమర్పిస్తే క్షుణంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని హైడ్రా కమీషనర్ రంగనాథ్ సూచించారు. గ్రామీణ మ్యాప్‌లతో పాటు నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, సర్వే ఆఫ్ ఇండియా, తెలంగాణ విభాగాలకు చెందిన మ్యాప్‌లతో పూర్తిస్థాయి పరిశీలన జరిపించి వారం రోజులలోపు నివేధిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నార్సింగిలోని మూసీ నది పరివాహక ప్రాంతాన్ని సైతం ఆయన పరిశీలించారు. కొన్ని నిర్మాణ సంస్థలు మూసీ నదిలోకి పోసిన మట్టిని తొలగించాలని అధికారులకు సూచించారు. బఫర్ జోన్‌కి మట్టిపోస్తే ఆయా సంస్థలపై చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.





## అంబులెన్స్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

**పెద్ద కొడప్గల్ క్రైమ్ మిర్రర్:** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం పెద్ద కొడప్గల్ ప్రభుత్వ ఆసుపత్రిలో అంబులెన్స్ ను సోమవారం జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు స్థానిక నాయకులతో కలిసి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు.రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.ఆసుపత్రి సిబ్బంది రోగులకు శక్తిమేరకు ఆరోగ్య సేవలు అందించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకే ఒక ఇన్చార్జి డాక్టర్ ఉన్నారని ఎమ్మెల్యేకు తెలిపారు.మారుమూల ప్రాంతమైన పెద్ద కొడప్గల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలని కోరారు.ఆసుపత్రి వద్ద ఒక బోర్ వేయాలని,ప్రహారి గోడను నిర్మించాలని ఎమ్మెల్యే ను కోరారు.అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.ఎమ్మెల్యేను 108 సిబ్బంది శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సంజీవ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగిరెడ్డి,మల్లప్ప పటేల్,అహ్మద్,మొగులాగౌడ్,సంతోష్,బస్వ రాజ్ దేశాయ్,నాగ్ నాథ్ పటేల్,జిన్నా రాములు,శంకర్,రషీద్,పండరి,బాల్ రాజు,మష్ణు,మారుతి,జోగొర్ నాయక్ చాంద్,యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## లార్డ్స్ పాఠశాల విద్యార్థులకు పథకాలు




**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలలో బడంగ్పేట్ లోని లార్డ్స్ పాఠశాల విద్యార్థులు యోగా పోటీలలో ఏడవ తరగతి విద్యార్థి రామస్వామి వెంకట గణపతి ప్రథమ స్థానంతో స్వర్ణ పథకాన్ని, రామస్వామి వెంకట కార్తికేయ రెండవ స్థానంతో రజత పథకాన్ని అందుకున్నారు. పథకాలు అందుకున్న విద్యార్థులను లార్డ్స్ గ్రూప్ ఆప్ స్కూల్ చైర్మన్ సిద్దల బీరప్ప, వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. విద్యార్థులలోని సృజనాత్మకతను అభిరుచులను వెలికి తీసి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడమే లార్డ్స్ పాఠశాలల ప్రధాన ఉద్దేశం అని తెలిపారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు




**పిట్లం క్రైమ్ మిర్రర్:** కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం బాన్సువాడకు చెందిన షి టీం సభ్యులు కళాశాల విద్యార్థిని,విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సెల్ ఫోన్లతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని,ద్విచక్ర వాహనాన్ని నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ వాడాలని,సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.అనంతరం పోలీసు కళాజాత బృందం వారు ప్రదర్శనలు చేశారు.ఈ కార్యక్రమంలో పిట్లం ఎస్సై రాజు,జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్,షి టీం బృందం సభ్యులు అనిల్,ప్రియాంక,కామారెడ్డి పోలీస్ బృందం సభ్యులు ప్రభాకర్,సాయులు ,రాజేందర్,పిట్లం పోలీస్ సిబ్బంది,జూనియర్ కళాశాల సిబ్బంది,విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## వెయ్యి గొంతులు లక్ష డప్పులు మహా కళా ప్రదర్శనను విజయవంతం చెయ్యాలి

### డప్పోల్ల రమేష్ రాష్ట్ర కోఆర్డినేటర్ మరియు ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి




**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి డిసెంబర్ 23 :** ఎస్సి రిజర్వేషన్ల వర్గీకరణ అమలు కోరుతూ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఫిబ్రవరి 3న హైదరాబాదులో జరుపతలపెట్టిన వెయ్యి గొంతులు లక్ష డప్పులు మహా కళా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి డప్పోల్ల రమేష్ మాదిగ కోరారు. సింగూరు చౌరస్తాలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఆయన ప్రసంగించారు. పార్టీలకు, సంఘాలకు అతీతంగా ప్రతి గ్రామం నుండి మాదిగలు సంకన డప్పు వేసుకుని హైదరాబాద్ తరలి రావాలని పిలుపునిచ్చారు. కవులు, కళాకారులు, విద్యావంతులు, నాయకులు అందరూ కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. జనవరి మూడవ తారీఖు నుండి ఫిబ్రవరి మూడు వరకు నెల రోజుల పాటు కళాకారుల రథయాత్ర నిర్వహిస్తామన్నారు. వార్డు మెంబర్ మొదలుకొని ఎమ్మెల్యే ఎంపీ మినిస్టర్ వరకు అటెండర్ మొదలుకొని ఐఏఎస్ ఐపీఎస్ వరకు అందరూ డప్పును సంకన వేసుకొని వెయ్యి గొంతులు లక్ష డప్పులు మహా కళా ప్రదర్శనలో పాల్గొనాలని నినదించాలని పిలుపునిచ్చారు. ముప్పై ఏళ్ల దండోరా పోరాటం ఫలితంగా ఆగస్టు ఒకటిన సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు ద్వారా వర్గీకరణ పోరాటం విజయం సాధించిందని అన్నారు. వర్గీకరణ అమలును వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వర్గీకరణ లేకుండా జరిగిన ఉద్యోగ ఉపాధ్యాయ గ్రూప్స్ తదితర నియామకాల్లో తీవ్ర స్థాయిలో నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వెయ్యబోయే ఏ నోటిఫికేషన్ అయినా వర్గీకరణ అమల్లోకి వచ్చిన తర్వాత మాత్రమే వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెయ్యి గొంతులు లక్ష డప్పులు మహా కళా పదర్శన రెండు మండలాల కమిటీల ఎన్నిక జరిగింది. పుల్కల్ మండల ఇన్చార్జీలుగా భూమక్కోల్ల లింగం, శివన్నోల్ల గణపతి మరియు చౌటకూర్ మండల ఇంచార్జీలుగా నాగులపల్లి శ్రీహరి, ఏర్పుల రాజేందర్ గారలను ఎన్నుకోవడం జరిగింది. ఈ ప్రెస్ మీట్ లో దళిత చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు పల్లె సంజీవయ్య, సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకులు నాగిరెడ్డిపల్లి కృష్ణంరాజు, జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య, మాదిగ జర్నలిస్టు ఫోరం ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి డప్పు అశోక్, ప్రముఖ కవులు తదితర మాదిగ సామాజిక వర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కోర్టు కేసులో ఉన్న భూమిలో పనులను నిలిపి వేసిన మణికొండ మున్సిపల్ అధికారులు






**గండిపేట్(క్రైం మిర్రర్):** కోర్టు కేసులో ఉన్న భూమిలో కొందరు వ్యక్తులు చదును చేసే పనులు చేపడుతుండడంతో మణికొండ మున్సిపాలిటీ అధికారులు సోమవారం పనులను నిలిపి వేయించారు. 6024 గజాల భూమిలో ఉన్న స్థలంపై కోర్టులో కేసు నడుస్తుంది. శనివారం నుంచి ఇందులో పనులు చేపడుతుండడంతో కాలనీ అధ్యక్షుడు డాక్టర్ పి.అవినాష్ ఆధ్వర్యంలో మణికొండ మున్సిపాలిటీ కమీషనర్ ప్రదీప్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారి అంకిత్ నేతృత్వంలో స్థలం వద్దకు వచ్చి పనులను నిలిపి వేయించారు. ఈ స్థలంలో ఎవరు కూడా పనులు చేపట్టవద్దని ఆదేశించారు. కాదని పనులు చేస్తే చట్టరిత్య చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## వృద్ధులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** సీఎస్ఏ సాంఘిక సేవ సంస్థ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా వికాస వృద్దుల ఆదరణ వేడుకను నూతనకల్ మండల కేంద్రంలోని విజయ మేరీ పాఠశాలలో నిర్వహించారు.ఈనాటీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి పాల్గొని నిత్యవసర వస్తువులు, నూతన వస్త్రాలు ఆ సంస్థ ప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విజయ మేరీ స్కూల్ హెచ్ఎం సబీనా సిస్టర్, బోనజ్ అమ్మ,సాబాది రమణ,ఇరుగు శిరీష పాల్గొన్నారు.




# ఎస్ సి ఎస్ టి మానిటరింగ్ నూతన కమిటీ ఏర్పాటు చేయాలి

## ఎరుకల కులస్తులకు చోటు కల్పించాలి

## ప్రజావాణిలో వినతి పత్రం ఇచ్చిన ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు

**మంచిర్యాల ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** మంచిర్యాల జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తెలంగాణ ఎరుకల ప్రజాసమితి జిల్లా అధ్యక్షులు ఉండ్రాళ్ళ ఎల్లయ్య ఎస్సి ఎస్టీ మానిటరింగ్ కమిటీ ని దశాబ్దాలుగా వారినే కొనసాగించడం జరుగుతుంది కాబట్టి నూతన కమిటీని ఏర్పాటు చేయాలని కోరినట్లు పత్రిక సమావేశంలో తెలిపారు. అంతే కాకుండా ఎస్సి ఎస్టీ మానిటరింగ్ కమిటీలో ఎరుకల సంఘ ప్రతినిధులకు అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ ని కోరినట్లు తెలిపారు.దశాబ్దాల కాలంగా గిరిజనులలో ఎంతో వెనుకబాటుకు గురై ఇప్పటివరకు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా అవకాశాలు లేక సమాజానికి దూరంగా జీవిస్తున్న మా ఎరుకల కులస్తులపైన దాడులు, మహిళలపై దాడులు జరుగుతున్నాయి కాబట్టి మా ప్రతినిధులకు ఎవరికైనా అవకాశం కల్పిస్తే మా కులానికి జరుగుతున్న అన్యాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కరించే అవకాశం ఉంటుంది కాబట్టి ఈ సారి అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు.దశాబ్దాల కాలంగా మాకు అవకాశం రాలేదు అన్నారు కాబట్టి ఈసారి ఎస్సి ఎస్టీ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి అందులో ఎరుకల కులస్తులకు అవకాశం కల్పించాలని కోరారు.



ఎడిటోరియల్



# 30 ఏళ్లలో 4 లక్షల రైతు ఆత్మహత్యలు

**సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ఇటీవల సమర్పించిన మధ్యంతర నివేదిక దేశం లో నెలకొన్న వ్యవసాయ సంక్షోభాన్ని కళ్ళకు కట్టినట్టు చూపింది. సమస్యల వలయంలో చిక్కుకు న్న అన్నదాతలు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యల బాట పడుతున్న తీరును ఈ నివేదిక సోదా హరణంగా వివరించింది. అన్నదాతలే గోసతీస్తుంటే వారి మీద ఆధారపడ్డ వ్యవసాయ కార్మికుల కుటుంబాల పరిస్థితి ఎలా బావుంటుందని ప్రశ్నించింది.**

దేశ వ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కార్మి కుల బలవన్మరణాలు పెరిగిపోతుండటానికి ఇదొక ముఖ్య కారణమని ఆ నివేదిక కుండ బద్దలు కొట్టింది. ఈ పరిస్థితిని తక్షణమే మార్చాలని పేర్కొనడంతో పాటు, దానికి అవసరమైన కనీస చర్యలనూ సూచించింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతో పాటు, దేశ వ్యాప్తంగా తక్షణమే రైతులకు రుణమాఫీ అమలు చేయడం ఈ కమిటీ చేసిన సూచనల్లో అత్యంత కీలకమైనవి. వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను మెరుగుపరచడం, సేంద్రీయ వ్యవసాయాన్ని, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడంతో పాటు వ్యవసాయ కార్మికుల పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఉపాధిహామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని చెప్పింది. ఇంత కీలకమైన ఈ సిఫార్సులకు మీడియాలో పెద్దగా ప్రాధాన్యత లభించకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. గత నెల రెండవ తేదీన పంజాబ్-హర్యానా హైకోర్టుకు చెందిన రిటైర్డ్ న్యాయమూర్తి నవాబ్‌సింగ్ అధ్యక్షతన ఈ ఉన్నత స్థాయి కమిటీని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. వ్యవసాయ రంగాన్ని అధ్యయనం చేసి సాధ్యమైనంత త్వరగా నివేదికను సమర్పించాలని ఈ కమిటీని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. సుప్రీం ఆదేశాల మేరకు పక్షం రోజుల్లోనే ప్రాథమిక పరిశీలనను పూర్తిచేసిన ఈ కమిటీ నవంబర్ 21వ తేదీన మధ్యంతర నివేదికను సమర్పించింది. వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన మూడు దశాబ్దాల దేశ వ్యాప్త నివేదికలు, గణాంకాలను ఈ కమిటీ పరిశీలించింది. పంజాబ్-హర్యానా రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి రూపొందించిన ఈ నివేదికలో అనేక షాకింగ్ విషయాలను పేర్కొంది. ముప్పయి సంవత్సరాలలో దేశ వ్యాప్తంగా నాలుగు లక్షల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నట్లు ఈ కమిటీ తేల్చింది. నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో డేటా ఆధారంగా ఈ నిర్ధారణకు కమిటీ వచ్చింది. ఇవి అధికారిక లెక్కలే కావడంతో వాస్తవంలో ఈ బలవన్మరణాలు మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వ్యవసాయం మీదనే ఆధారపడిన రైతులు రోజుకు 27 రూపాయలు మాత్రమే సంపాదిస్తున్నట్లు కమిటీ తేల్చింది. జాతీయ సర్వేతో పాటు నాబార్డు నివేదికలు, గ్రామీణ భారతంలోని వ్యవసాయ కమతాలు, పశుసంపదకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ రికార్డులను పరిశీలించి రైతుల ఆదాయంపై ఈ నిర్ధారణకు వచ్చిన కమిటీ 'ఇంత తక్కువ ఆదాయంతో జీవనాన్ని కొనసాగించడం అసాధ్యం. ఇదే వారిని ఆత్మహత్యల వైపు నడిపిస్తోంది' అని పేర్కొంది. దేశ వ్యాప్తంగా ఉన్న మొత్తం కార్మికుల్లో 46 శాతం మంది ఇప్పటికీ వ్యవసాయం మీదనే ఆధారపడి ఉన్నారని, ఆదాయంలో వారి వాటా కేవలం 15 శాతమేనని తెలిపింది. వ్యవసాయ కార్మిక కుటుంబాల్లో నిరుద్యోగులుగా ఉన్న వారు, జీతం లేకుండానే కుటుంబం తరపున రెక్కలు ముక్కలు చేసుకుంటున్న వారి సంఖ్య కూడా గణనీయంగానే ఉందని కమిటీ పేర్కొనడం గమనార్హం. ఇది ఏదో రూపంలో కొనసాగుతున్న వెట్టిచాకిరీకి నిదర్శనం.మ సమస్యల పరిష్కారం కోసం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతాంగం దేశ వ్యాప్త ఆందోళనకు తిరిగి సిద్ధమౌతున్న నేపథ్యంలో ఈ నివేదిక వెలువడటం ప్రాధాన్యత నంతరించుకుంది. కొన్ని సంవత్సరాలుగా రైతాంగం ఏదైతే చెబుతుందో దాదాపుగా అవే అంశాలు అంతే తీవ్రతతో ఈ నివేదికలోనూ కనిపించడం క్షేత్రస్థాయిలో నెలకొన్న దుస్థితికి దర్పణం పడుతోంది. కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణం రైతుల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాలి. సుప్రీంకోర్టు ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సు చేసిన, రైతాంగం ఎప్పటి నుండో డిమాండ్ చేస్తున్న కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, రుణ మాఫీ వంటి చర్యలకు తక్షణం శ్రీకారం చుట్టాలి.

# కడప ఉక్కు పరిశ్రమతో పాలకుల చెలగాటం



**క**డప ఉక్కు పరిశ్రమ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చాలా కాలంగా చెలగాటమాడుతున్నాయి. పరిశ్రమ వస్తే ఉద్యోగాలు వస్తాయని, బతుకులు బాగు పడతాయని ఎదురు చూస్తున్నసీమ బిడ్డలఆశలు అడియాసలు అవుతున్నాయి. కడప స్టీల్‌ప÷-లాంట్ కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేదని గత మంగళవారం లోక్‌సభలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి ప్రకటించారు. ఇప్పటికే విశాఖ ఉక్కు ఉంటుందా, ఊడుతుందా అని ఆందోళనలో ఉన్న రాష్ట్ర ప్రజలకు కేంద్రం చేసిన మరో ద్రోహం ఇది. 20 వేల కోట్ల పెట్టుబడి అంచనాతో 20 లక్షల టన్నుల సామర్థ్యంతో, ప్రత్యక్షంగా 25 వేలు, పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని రాయల సీమ యువతను ఇన్నాళ్ళుగా ఊరించిన పాలకుల నిజ స్వరూపం పార్లమెంట్ సాక్షిగా బయట పడింది. గత పది సంవత్సరాలకు పైగా రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇవ్వకుండా మోసపూరితంగా వ్యవహరించారు. ప్రస్తుతం కేంద్రంలో తాము అధికారంలో వుండడానికి ఆంధ్ర ప్రజలు తెలుగుదేశం, జనసేన పార్టీలు ఇచ్చిన బలమే ఆధారమనే స్పృహలో ప్రకటించారు. దాదాపు నాలుగున్నర సంవత్సరాలు కేంద్ర బిజెపికి మద్దతుదారుడిగానే కాకుండా, కేంద్ర ప్రభుత్వంలో టిడిపి భాగస్వామిగా వుంది. ఆ కాలంలో కడప ఉక్కు గురించి కేంద్రంతో మాట్లాడి సాధించకుండా లాభదాయకం కాదని సన్నాయి నొక్కులు నొక్కింది. సొంత గనులు

లేకుండా ఉక్కు పరిశ్రమ నిర్మించలేమని మరో వాదన తెచ్చారు. 'సెయిల్' అధ్యయనం పేరుతో కడప ఉక్కు కూడా కేంద్ర పాలకులు లేరు. ఇందుకు ప్రధాన కారణం మన రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల వెన్నెముక లేని రాజకీయ వైఖరులే. వ్యక్తిగత, స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర పాలక, ప్రతిపక్షాల నేతలు కేంద్రం ముందు సాష్టాంగ ప్రణామాలు చేస్తున్నంత కాలం ఆంధ్రకు బిజెపి చేస్తున్న ద్రోహపూరిత వైఖరిలో మార్పు రాదు. కరువుకు కేరాఫ్ అడ్రస్ అయిన సీమలో యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో నాటి సీఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డి కడపలో బ్రహ్మణి ఉక్కు పరిశ్రమను నిర్మించాలని 2007 జూన్ 10న అంబవరం గ్రామ సమీపంలో శంకుస్థాపన చేశారు. రైతుల నుండి ఒక్క ఎకర భూ సేకరణ చేయకుండా అందుబాటులో వున్న 10 వేల ఎకరాల ప్రభుత్వ భూమిలో ఈ పరిశ్రమను నిర్మిస్తున్నామని ప్రకటించారు. పరిశ్రమను నిర్మించే బ్రహ్మణి స్టీల్ కంపెనీకి ఎకరం 18 వేల చొప్పున 10 వేల ఎకరాల భూమి అప్పగించారు. పరిశ్రమ ఒక్క అడుగు ముందుకు పడకపోయినా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పాలకులు, వారి అనుచరులు వేల కోట్లు దండుకున్నారు. రాజశేఖరరెడ్డి మరణానంతరం రాష్ట్ర విభజన జరిగింది. రాష్ట్ర విభజన వల్ల నష్టపోయే ప్రాంతాల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం-2014లో కడపలో ప్రభుత్వ రంగంలోనే భారీ ఉక్కు పరిశ్రమను నిర్మిస్తామని అప్పటి కేంద్ర కాంగ్రెసు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి అధికార బిజెపి దానిని బలపరచింది. రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసిన పదేళ్ళ తర్వాత విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు 2018లో ఎన్నికలకు సరిగ్గా ఐదు నెలల ముందు గండికోట రిజర్వాయర్ సమీపంలోని కంబాలదిన్నె గ్రామం వద్ద మరోసారి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ప్రభుత్వమే 4 వేల ఎకరాల్లో ఉక్కు పరిశ్రమను నిర్మిస్తుందని ఆయన వారి బంధం చెడిన తర్వాత అప్పటి తన పార్టీ రాజ్యసభ సభ్యుడు సి.ఎం. రమేష్‌తో 2018 జూన్ 20న కడపలో నిరాహారదీక్ష చేయించి, ప్రభుత్వమే ఉక్కు పరిశ్రమను నిర్మిస్తుందని హామీ ఇచ్చి ఆ దీక్షా నాటకానికి తెర దించారు. ఆ నేపథ్యంలోనే 2018 డిసెంబర్ 27న ఉక్కు పరిశ్రమకు రెండవసారి శంకుస్థాపన జరిగింది. తర్వాత జగన్ మోహన్ రెడ్డి 2019 డిసెంబర్ 23న మూడోసారి శంకుస్థాపన చేశారు. పరిశ్రమ నిర్మాణంలో ప్రభుత్వరతో పాటు ప్రైవేటు భాగస్వామ్యానికి అవకాశం కల్పిస్తూ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ (ఆర్ఎఫ్‌పి) పద్ధతుల్లో గ్లోబల్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ పరిశ్రమకు ప్రతి సంవత్సరానికి రెండు టిఎంసీల నీరు, నాలుగు లైన్ల రోడ్లు, రైలు మార్గం ఏర్పాటు కోసం టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లకు పని దొరికింది. పాలకులకు కమిషన్లు అందాయి. పరిశ్రమ మాత్రం ఒక్క అడుగు ముందుకు పోలేదు. తిరిగి 2023 ఫిబ్రవరి 15న ఇదే ఉక్కు పరిశ్రమకు మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. నాలుగు సార్లు శంకుస్థాపన చేసినా పని ఒక్క అంగుళం కూడా ముందుకు జరగని ఏకైక పరిశ్రమ బహుశా ఇదేనేమో! వెనుకబడిన ప్రాంతాల గురించి మొసలి కన్నీరు కారుస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో, పరిశ్రమ పేరుతో కాంట్రాక్టు పనుల్లో కమిషన్లలో కోట్లు కొల్లగొట్టడానికి, ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి శంకుస్థాపనలు చేస్తూ రాయలసీమ ప్రజలను పాలక పార్టీలు పదేపదే మోసం చేస్తున్నాయి. రాష్ట్ర విభజన చట్టంలో రూపొందించిన అంశాలపై ఆనాడు కేంద్రంలో ప్రతిపక్ష పార్టీగా బీజేపీ నానా రగడ చేసింది. ప్రత్యేక హోదాతో పాటు, కడప ఉక్కు పరిశ్రమ గురించి నాడు తెలుగుదేశం, పవన్, జగన్‌తో కలిసి తిరుపతి సభలో ప్రధానమంత్రి హామీ ఇచ్చారు. ఆ తర్వాత మాటల గారడీకి తెరలేపింది. కడపలో ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ నిర్మించడం సాంకేతికంగా, ఆర్థికంగా పరిశ్రమ నష్టాదాయకమని చెప్పారు. ఈ వితండ వాదనలు చేస్తున్న కేంద్ర బిజెపి ని నాటి అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైసిపి కనీసంగా కూడా ప్రశ్నించలేదు. పార్లమెంట్‌లో నిలదీసి ఉక్కు పరిశ్రమ సాధనకు ఉద్యమం చేయలేదు. కలిసిమెలసి వున్నకాలం పూర్తయిన తర్వాత తెలుగుదేశం నాయకులు కేంద్రాన్ని విమర్శించడం ప్రారంభించారు. కడపలో ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ స్థాపిస్తామని, రాయసీమలో రెండో రాజధాని, కర్నూలులో హైకోర్టు ఏర్పాటు, సాగునీటి ప్రాజెక్టులకు 20 వేల కోట్ల నిధులు అంటూ 16 డిమాండ్లతో కూడిన రాయలసీమ డిక్లరేషన్‌ను బిజెపి 2018 ఫిబ్రవరి 22న కర్నూలులో ప్రకటించింది. దీనికి ప్రతిగా 'ప్రజలను మభ్యపెట్టడంలో దిట్టలు మోడీ, అమిత్‌షాలని టిడిపి ఎంపీ గల్లా జయదేవ్ తీవ్రంగా విమర్శించారు. వెంటనే బిజెపి రాయలసీమ వాదన అందుకుంది.ల్గ÷సిపి అధికారంలో వున్నంతకాలం కేంద్ర బిజెపికి పార్లమెంట్‌లో అండగా నిలచింది. వినాశకర బిల్లులు, విధానాలన్నింటినీ బలపరచింది. రాష్ట్రంలో అమలుచేసేందుకు అతి ఉత్సాహాన్ని ప్రదర్శించింది. ఇంతా చేసి కడపకు ఉక్కు పరిశ్రమను మాత్రం సాధించలేకపోయింది. టిడిపి, జనసేన పార్టీలు బిజెపి తో జతకట్టిన వెంటనే కడప ఉక్కు పరిశ్రమ వైసిపి కి గుర్తుకు వచ్చింది. కేంద్రం కడప ఉక్కును అడ్డుకుందని వైసిపి నాయకులు విమర్శించడం ప్రారంభించారు.

ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నాయుడు కడప ఉక్కు గురించి హామీ ఇచ్చిన విషయం కడప జిల్లాలో రెండు ఎంఎల్ఏ సీట్లకు పోటీ చేసిన బిజెపికి తెలియదా? అప్పుడు ఉక్కు పరిశ్రమ సాధ్యంకాదని ఎందుకు చెప్పలేదు? రాష్ట్రం కోసం ఎవరినైనా ప్రశ్నిస్తా అని చెప్పిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కడప ఉక్కు లేదని కేంద్రమంత్రి పార్లమెంట్‌లో చెబుతుంటే ఎందుకు కేంద్రాన్ని ప్రశ్నించరు?

## కింగ్‌ఫిషర్ టవర్స్‌లో ఫ్లాట్‌ను కొనుగోలు చేసిన

### ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి



**ఇ**న్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి లగ్జరీ అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేసినట్లు తెలిసింది. బెంగళూరులోని ప్రఖ్యాత కింగ్‌ఫిషర్ టవర్స్‌లో రూ.50 కోట్లు వెచ్చించి విలాసవంతమైన ఫ్లాట్‌ను కొనుగోలు చేసినట్లు సమాచారం. నివేదికల ప్రకారం.. నాలుగు బెడ్‌రూమ్‌ల ఈ ఫ్లాట్ 8,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో 16వ అంతస్తులో ఉంది. మొత్తం ఐదు విలాసవంతమైన కార్లను పార్క్ చేసుకోవచ్చు. ముంబైకి చెందిన ఓ వ్యాపారవేత్త నుంచి ఈ ఫ్లాట్‌ను మూర్తి కొనుగోలు చేశారు. కాగా, నాలుగేళ్ల క్రితం నారాయణమూర్తి భార్య సుధామూర్తి అదే కాంప్లెక్స్‌లోని 23వ అంతస్తులో రూ.29 కోట్లతో ఫ్లాట్‌ను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. కింగ్‌ఫిషర్ టవర్స్ బెంగళూరు నడిబొడ్డున యూబీ సిటీలో ఉంది. ఇది కింగ్ ఫిషర్ అధినేత విజయ్ మాల్యా పూర్వీకుల ఇల్లు ఉన్న స్థలం. దాదాపు 4.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలాన్ని విజయ్ మాల్యా-ప్రెస్టీజ్ గ్రూప్ రెండు కలిసి అభివృద్ధి చేశాయి. 34 అంతస్తుల కింగ్‌ఫిషర్ టవర్స్‌లో మూడు బ్లాక్‌లు ఉన్నాయి. వీటిలో 81 అల్ట్రా-లగ్జరీ అపార్ట్‌మెంట్‌లు ఒక్కొక్కటి 8,000 చదరపు అడుగుల విస్తీర్ణం కంటే ఎక్కువ స్థలంలో ఉన్నాయి. 2010లో ప్రాజెక్ట్ మొదటిసారి ప్రారంభించబడినప్పుడు, ఫ్లాట్‌లు చదరపు అడుగులకు రూ.22,000 చొప్పున అమ్ముడయ్యాయి. ప్రస్తుతం మూర్తి చదరపు అడుగు రూ.59,500తో కొనుగోలు చేసినట్లు తెలిసింది.

# తెలంగాణ పల్లెల్లో ఇంటర్నెట్ విప్లవం..

**ప**ల్లెలే దేశాభివృద్ధి సూచికలు. ఒక దేశం పురోగతిని గ్రామీణ ప్రాంతల్లో ప్రజల జీవన పరిస్థితులు నిర్వచిస్తాయి. తెలంగాణ ఏర్పాటు తరువాత రాష్ట్రం రాష్ట్రం అనేక రకాలుగా ప్రగతి సాధించింది అనేది నిజం. రోడ్లు, తాగునీరు, పారిశు ద్ధ్యం, మౌళిక సదుపాయాల కల్పన రంగాలలో మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. రేవంత్ రెడ్డి సర్కార్ దీనిని ముందుకు తీసుకువెళుతోంది. ఈ క్రమంలో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ విప్లవాన్ని తీసుకురాబోతోంది. ప్రతి ఇల్లు ఇక ఇంటర్నెట్

సౌకర్యాన్ని పొందనుంది.రూ.300కే ఇంటర్‌నెట్ కనెక్షన్ అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. రాష్ట్రంలోని లక్షల ఇళ్లకు దశలవారీగా ప్రభుత్వం ఈ సౌకర్యం కల్పించనుంది. ఇది వై÷ కనెక్షన్ లాంటిది. ఈ కనెక్షన్ తీసుకుంటే వర్చువల్ నెట్‌వర్క్‌తో పాటు టెలిఫోన్, పలు తెలుగు ఓటీటీలను గ్రామీణ ప్రజలు చూడటానికి వీలుపడుతుంది. మొదటి దశలో నారాయణపేట, సంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాల్లోని 2,096 పంచాయతీల్లో అమలు చేయనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం దీనిని ప్రారంభిస్తారు. తరువాత మిగిలిన గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తిచేయనున్నారు. దేశంలోని అన్ని గ్రామాలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించే లక్ష్యంతో భారత్ నెట్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఒక పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా రాష్ట్రానికి రూ.2,500 కోట్లు కేటాయించింది. ఈ పథకం కింద గ్రామాల్లో ప్రతి ఇంటికి అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించేందుకు ఫైబర్ నెట్ కనెక్షన్‌ను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వ్యవస్థ ఏర్పాటు బాధ్యతను టీ ఫైబర్ సంస్థ తీసుకుంది. ప్రతి ఇంటికి రూ.300కే ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దీన్ని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఈ కనెక్షన్ తీసుకుంటే ప్రతి ఇంట్లో ఉన్న టీవీనే కంప్యూటర్‌గా మారుతుందని అధికారులు చెబుతున్నారు. 20 ఎంబీపీఎస్ స్పీడ్‌తో కనెక్షన్ ఇస్తారు. ఈ కనెక్షన్ ద్వారా చెల్లింపులు కూడా చేయవచ్చు. గ్రామంలోని అన్ని కార్యాలయాలకు, స్కూళ్లకు కూడా కనెక్షన్ ఇవ్వనున్నారు. టీవీనే కంప్యూటర్‌గా మారుతుంది కాబట్టి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే అవకాశముంది. ఈ కనెక్షన్ తీసుకునేవారితో హైదరాబాద్ నుంచి సీఎం నేరుగా మాట్లాడే వీలు కలుగుతుందని అధికారులు తెలిపారు.

ప్రతి గ్రామంలోనూ జంక్షన్లు, ఇతర చోట్ల కూడా అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి ÷బైర్‌నెట్‌తో అనుసంధానం చేయబోతున్నారు. ఇవి ప్రతి పోలీసుస్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానమవుతాయి. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్




అనుసంధానంతో పాటు డిజిటల్ సేవలు అందించడమే టీ-÷బైర్ లక్ష్యం. టీ ఫైబర్ నెట్‌వర్క్ ఆపరేషన్స్ సెంటర్(టీ-ఎన్‌వోసీ) నుంచి ఈ వ్యవస్థను పర్యవేక్షిస్తున్నాం. 94 మండలాలు, 2,096 గ్రామ పంచాయతీల్లో కమర్షియల్ సేవలు అందించేందుకు వీలుగా పనులు పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టు తొలిదశలో 30 వేల ప్రభుత్వ సంస్థలను అనుసంధానించేందుకు ప్రణాళికలు చేశాం. ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్(పీవోసీ)లో భాగంగా తొలిదశలో మద్దూరు, సంగుపేట్, అడవి శ్రీరామ్‌పూర్ గ్రామాల్లో టీ-÷బైర్ ట్రయల్ సేవలను ఈనెల 8న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు. నిజానికి, ఈ స్కీంకు సంబంధించి గత సెప్టెంబర్ నుంచే రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది.

క్రైమ్ THE మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
మంగళవారం 24-12-2024


# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే




**పిట్లం క్రైమ్ మిర్రర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకలలో భాగంగా సోమవారం కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం పిట్లం మండలంలోని రాజ రాజేశ్వరి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యఅతిథిగా జుక్కల్ నియోజక వర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు హాజరయ్యారు.ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి,క్రిస్మస్ సోదరి,సోదరులకు అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలను తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....నిన్ను నువ్వు ప్రేమించినట్టుగానే పొరుగువారిని కూడా ప్రేమించమని క్రీస్తు ప్రబోధనల్లో సమస్త అంశాలు సంక్షిప్తమై ఉన్నాయనీ,తెలంగాణలో సర్వమతాలకు సమానమైన సంపూర్ణ రక్షణ కల్పించడం ప్రజా ప్రభుత్వ విధానమని ఎమ్మెల్యే అన్నారు.విద్య,వైద్యం విషయంలో క్రిస్టియన్ మిషనరీలు ప్రభుత్వాలతో పోటీ పడి నిరుపేదలకు సేవలు అందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని అభినందించారు..సమాజ నిర్మాణంలో ఆదర్శవంతులుగా,విద్యార్థినీ,విద్యార్థులను ఒక బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఆదర్శంగా నిలబడ్డారని,క్రిస్మస్ పండుగను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా రాష్ట్రమంతా నిర్వహిస్తోందని గుర్తుచేశారు.దళిత క్రిస్టియన్ల సంక్షేమానికి,అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతుందని అన్నారు.ఈ సందర్భంగా పాస్టర్లు,క్రిస్టియన్ పెద్దలు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావును పూలమాలవేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి,పిట్లం మండల తహసిల్దార్ వేణుగోపాల్,ప్రభుత్వ అధికారులు,పిట్లం,మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు,క్రిస్టియన్ పెద్దలు,పిట్లం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.



# పెరుగుతున్న సీజనల్ వ్యాధులు

## వైద్యం అందించడంలో బస్తీ దావాఖానాలు డీలా...

## బస్తీ దావాఖానాల్లో మందులు లేవు అంటూ కుంటి సాకులు




**గండిపేట్(క్రైం మిర్రర్):** అసలే సీజనల్ వ్యాధులతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వ ఆసుపత్రుల డాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పేరుకే బస్తీ దావాఖానాలు తప్ప సౌకర్యాలు మాత్రం నిల్‌గా కనిపిస్తున్నాయి. ప్రజలు వైద్యం కోసం వెళితే కుంటి సాకులు చెబుతూ బయట నుంచే వారిని పంపించే దారుణ స్థితి పెరిగిపోతుంది. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని ఆప్కో, ఆదర్శ కాలనీ లో కాలనీలో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన బస్తీ దవాఖాన తీవ్ర సమస్యలను ఎదుర్కొంటోంది. ఈ దవాఖానకు వెళ్లే రోగులు "మందులు లేవు" అనే కారణంతో వైద్య సేవలు అందకపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్లను ప్రశ్నిస్తే, వారు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ దవాఖాన అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి చోటు చేసుకుంది. ప్రస్తుత సమయంలో జ్వరం మొదలైన వ్యాధులకు అవసరమైన సాధారణ మందులు కూడా లభించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వ్యాధులు ప్రబలుతున్న వేళ, మందులు లేవన్న సమాధానాలు దవాఖానలో నెలకొన్న దుస్థితికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి. అంతేకాకుండా, రోగులు గంటల తరబడి దవాఖాన వద్ద కాపులు కాస్తున్నప్పటికీ వైద్యులు సకాలంలో అందుబాటులో లేకపోవడం బస్తీ ప్రజలను తీవ్ర ఆగ్రహానికి గురి చేస్తోంది. సంబంధిత రంగారెడ్డి జిల్లా డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ఈ విషయంపై తక్షణం స్పందించి, బస్తీ దవాఖాన సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## విద్యార్థులందరినీ అపార్ లో నమోదు చేయాలి

### ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వరరావు

వాజేడు, క్రైమ్ మిర్రర్ న్యూస్: విద్యార్థులందరినీ అపార్ లో నమోదు చేయాలని వాజేడు మండల విద్యాధికారి తేజావత్ వెంకటేశ్వరరావు మండలంలోని ఉపాధ్యాయులకు సూచించారు. ములుగు జిల్లా వాజేడు మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఆపార్ నమోదు శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి యొక్క పూర్తి వివరాలను (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) అని పిలువబడే అపార్ లో నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థి యొక్క వివరాలు ఒక్కసారి అపార్ లో నమోదు అయితే చదువుకు సంబంధించిన అన్ని సర్టిఫికెట్లు, మార్క్ షీట్లు, గ్రేడ్లు, డిగ్రీలు అపార్ లో నిలువ చేయబడతాయని, నమోదు అయిన విద్యార్థులకు ఇచ్చిన 12 అంకెల కోడ్(డిజిటల్ ఐడి) తో ఎప్పుడైనా తన సమాచారాన్ని పొందవచ్చుని ఉపాధ్యాయులకు సూచించారు. యుడైస్ ప్లస్ కు కొనసాగింపుగా ఉంటుందని, కావున ఉపాధ్యాయులు విద్యార్థులందరి వివరాలను తప్పులు లేకుండా ఆధార్ కార్డు ప్రాతిపదికన విద్యార్థుల తల్లిదండ్రుల అనుమతి పత్రంతో అపార్ లో సమాచారం పొందుపరచాలని కోరారు. అపార్ లో నమోదైన విద్యార్థి ఒక పాఠశాల నుంచి ఇంకొక పాఠశాలకు మారాలనుకున్నప్పుడు అపార్ సులభతరం చేస్తుందని, తమ దగ్గర చదివిన విద్యార్థి ప్రస్తుతం ఏ పాఠశాలలో చదువుతున్నారని కూడా అపార్ ద్వారా తెలుస్తుందని, ఈ పద్ధతి ద్వారా విద్యార్థులలో నిలుపుదలను తగ్గించవచ్చుని, ఉపాధ్యాయులందరూ అపార్ నమోదు శిక్షణలో పూర్తి విషయాలు తెలుసుకొని త్వరితగతిన విద్యార్థుల వివరాలను నమోదు చేసి జిల్లాలో వాజేడు మండలాన్ని ప్రథమ స్థానంలో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోయం ఆనందరావు, అపార్ నమోదు శిక్షకులు పోరిక రవికుమార్, మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి అధికారులు బాధితులను ఆదుకోవాలి

### సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి బిరెడ్డి సాంబశివ



వాజేడు, క్రైమ్ మిర్రర్ న్యూస్: ములుగు జిల్లా వాజేడు మండలంలోని జగన్నాథపురం గ్రామం నుండి చెరుకూరు గ్రామం వరకు చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణలో ఇళ్లులు, దుకాణాలను కోల్పోతున్న పేదలను ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి బిరెడ్డి సాంబశివ జాతీయ రహదారి అధికారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ వాజేడు మండల కమిటీ ఆధ్వర్యంలో గుమ్మడిదొడ్డి గ్రామంలో గుగ్గిళ్ళ దేవయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి బిరెడ్డి సాంబశివ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో విస్తరణ పనులు జరుగుతున్న జాతీయ రహదారులు గ్రామాల మధ్య నుండి ఉండడంతో విస్తరణ పేరుతో జరుగుతున్న పనులలో పేద ప్రజలు ఇళ్లులను, దుకాణాలను కోల్పోవాల్సి వస్తుందని, జాతీయ రహదారి పేరుతో విస్తరణ జరిగే ముందే రోడ్డుకు ఇరువైపులా ఉన్నటువంటి ప్రజలను ముందస్తుగానే అవగాహన కల్పించి వారికి జరుగుతున్నటువంటి నష్టాన్ని బాధితులకు తెలిసే విధంగా ముందే ప్రకటించాలని, సర్వే చేసే ముందు ఎటువంటి హెచ్చరికలు లేకుండానే, అవగాహన కల్పించకుండానే సర్వే చేసి ముందు సర్వే చేసినప్పుడు కొంత భాగం వెళ్తుందని ప్రజలకు చెప్పి ఇప్పుడు విస్తరణ పనులు ప్రారంభించిన తర్వాత ఎక్కువ బాగం నష్టపోయేటట్టు ఇంకా లోపలికి ఆక్రమించడంతో ప్రజలకు అనేక సందేహాలు కలుగుతున్నాయని, అవగాహన కల్పించడంలో జాతీయ రహదారి అధికారులు విఫలమయ్యారని, మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో జాతీయ రహదారులు చేపట్టే ముందు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఏజెన్సీలో అభివృద్ధి జరిగేటప్పుడు పిసా గ్రామ సభల ద్వారా ప్రజల అభిప్రాయాలు తీసుకోవాలని, ఇకనైనా ప్రభుత్వం పునరలోచన చేసి ప్రజలను అన్ని విధాల ఆదుకోవాలని, నష్టపరిహారం చెల్లించి బాధితులకు తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు, బచ్చల కృష్ణ బాబు, బచ్చల సౌమ్య, కారం నాగేశ్వరరావు, పాయం కుమారి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## వంద శాతం ఇంటింటి చెత్తను సేకరించాలి

### బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర

**గండిపేట్(క్రైం మిర్రర్):** వంద శాతం ఇంటింటి చెత్త సేకరణ పనులు క్రమం తప్పకుండా జరగాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. సోమవారం 10వ డివిజన్‌లోని అభ్యుదయనగర్‌లో, 12వ డివిజన్‌లోని హిమాయత్‌సాగర్‌లలో డోర్ టూ డోర్ చెత్త సేపకరణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం 11వ డివిజన్‌లోని దర్గా ఖలీజ్‌ఖాన్‌లో అండర్ గ్రౌండ్ డ్రై నేజీ క్లీనింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు జగన్, యాదగిరి, తౌఫీక్, రాము తదితరులు పాల్గొన్నారు.

## తప్పులు లేకుండా ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేపడుతున్నాం

### బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర



**గండిపేట్(క్రైం మిర్రర్):** తప్పులు లేకుండా ఇందిరమ్మ ఇళ్ల సర్వేను చేపడుతు వారి వివరాలను నమోదు చేసుకోవడం జరుగుతుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర వెల్లడించారు. సోమవారం 4వ డివిజన్‌లోని హైదర్షాకోట్, 15వ డివిజన్‌లోని శాంతదినగర్ కాలనీ, 16వ డివిజన్‌లోని రఘురాంనగర్ కాలనీలలో సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ వెంకటప్ప, బిల్ కలెక్టర్ నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వాటిపై చర్యలు తీసుకోవాలి

### మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షులు ధూళిపాళ సీతారాం



**గండిపేట్(క్రైం మిర్రర్):** అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దర్జాగా రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షులు ధూళిపాళ సీతారాం అన్నారు. ఈ మేరకు మున్సిపాలిటీ కమీషనర్ ప్రదీప్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. మారుతీనగర్‌లోని రోడ్ నెంబర్ 2లో వాస్తవంగా చివరి భాగం పాలకడ స్కూల్ కాంపౌండ్ వాల్ వరకు ఉండవలసిన ప్రాంతంలో కొంత మంది స్వార్థపరులు రెండు బిల్డింగులు కడుతున్న విషయం, రోడ్ నెంబర్ 3,5లలో వాటితో పాటు ఎలక్ట్రికల్ పోల్స్ అక్రమణకు గురైనట్లు స్థానికులు వివరించామన్నారు. వెంటనే కమీషనర్‌ను కలిసి విచారణ జరపాలని తక్షణ చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అలాగే పార్కు స్థలం 1100 గజాలకు గాను 600 గజాలే మిగిలిన విషయం కూడా కమీషనర్ దృష్టికి తీసుకువచ్చామన్నారు. ఈ అక్రమణలను తక్షనమే అరికట్టాలని వారిని కోరామన్నారు. అందుకు కమీషనర్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కంబగళ్ల ధనరాజ్, మహిళా అధ్యక్షురాలు రూప రెడ్డి, గుట్టమీద రాఘవేంద్ర, లక్ష్మయ్య, రాజేంద్రప్రసాద్, విజయలక్ష్మి, శ్రీకాంత్, మాల్యాద్రినాయుడు, సుమన్, సుమ, నలిని, అనూష, ప్రవీణ్, జయరాం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 మంగళవారం 24-12-2024

# ఆరాంఘర్ చౌరస్తాలో ఆటో స్టాండ్ సమస్య పరిష్కారం

**రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జాజాల రుద్రకుమార్**



**గండిపేట్(క్రైం మిర్రర్):** ఆరాంఘర్ చౌరస్తాలో సీఐటీయూ ఆటో స్టాండ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జాజాల రుద్రకుమార్ కోరారు. ఈ మేరకు సీఐటీయూ రాజేంద్రనగర్ మండల ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ యూనియన్ మండల కార్యోదర్శి కాలే రాజు అధ్యక్షతన రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాజాల రుద్రకుమార్ మాట్లాడుతూ ఆరాంఘర్ నుంచి మెహిదీపట్నం బస్‌స్టాప్ రోడ్డులో గత చాలా సంవత్సరాల కాలం నుంచి ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. 50 మంది ఆటో కార్మికులు ఈ మధ్యకాలంలో ఆరాంఘర్ చౌరస్తాలో పబ్లిక్ రద్దీ పెరిగే ఉన్నది కాబట్టి అక్కడ ఆటోలు ఆపడం ఇబ్బంది గురవుతుందన్నారు. చౌరస్తాలోపిల్లర్ నెంబర్ 319%-%320 మధ్యలో ఖాళీ స్థలం ఉందని అక్కడ వివిధ ప్రాంతాలకు సంబంధించిన టూ వీలర్ వాహనాలు అక్కడ పెట్టి పార్కు చేసి వెళ్లిపోతున్నారన్నారు. కొంత మంది ఏకంగా వారం రోజులు కూడా టు వీలర్ అక్కడే గుర్తు తెలియని వ్యక్తులు పార్కు చేస్తున్నారన్నారు. ఆటో కార్మికుల పార్కింగ్ సమస్య పరిష్కారం కావాలంటే ట్రాఫిక్ సీఐ చొరవ చూపి ఆటో కార్మికులకు ఆ స్థలంలో ఆటోలు పార్కు చేసే విదంగా పర్మిషన్ ఇవ్వాలని కోరామన్నారు. దీనికి ట్రాఫిక్ సీఐ సానుకూలంగా స్పందించారన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ట్రాన్స్‌ఫోర్ట్ ఆటో కార్మికులందరూ సహకరించాలన్నారు. ఐక్యమత్యంతో ఉంటూ క్రమ శిక్షణతో నడుపుకోవాలని ఆటోలను సీరియల్‌గా పెట్టుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు, ఆర్టివో నిబంధనలను పాటించాలని పర్మిషన్ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆరాంఘర్ ఆటో యూనియన్ నాయకులు ఇమ్రాన్, శ్రీను, లతీఫ్, రజాక్, భాషా, నారాయణ, మూర్తినాయక్, ఈశ్వర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు ఉంటే సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలి

**రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమీషనర్ రవికుమార్**

**గండిపేట్(క్రైం మిర్రర్):** ప్రజా సమస్యలపై ఎలాంటి ఇబ్బందులు ఉన్నా సర్కిల్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు సమర్పించాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమీషనర్ రవికుమార్ సూచించారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి మూడు ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు. ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, ట్యాక్స్ సెక్షన్‌కు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిని సంబంధిత శాఖలకు పంపించి తక్షణ పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణను తెలంగాణలో తక్షణమే అమలు చేయాలి

**ఫిబ్రవరి 03న లక్ష డప్పులు వెయ్యి గొంతుల మహా పదర్శనను విజయవంతం చేయండి**



**నూతనకల్ (క్రైమ్ మిర్రర్) :** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఆగస్టు 01న తీర్పుని ఇస్తే ఇచ్చిన అర్ధ గంటకే నిండు అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలోనే తెలంగాణ ప్రభుత్వం మొట్ట మొదలు అమలు చేస్తుంది అని చెప్పి నేటికీ అమలు చేయకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాదిగలను మోసం చేస్తునందుకు నిరసనగా ఫిబ్రవరి 03న హైదరాబాద్ లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగే లక్ష డప్పులు వెయ్యి గొంతుల మహా పదర్శనకు ప్రతి గ్రామం నుండి మాదిగ మరియు మాదిగ ఉప కులాల కవులు కళాకారులు వేలాది సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంఎస్పి ఉమ్మడి నల్గొండ జిల్లా కోఆర్డినేటర్ కందుకూరి సోమన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బోడ సునీల్ మాదిగ పిలుపునిచ్చారు.సోమవారం నూతనకల్ మండల కేంద్రంలో జరిగిన ఎమ్మార్పీఎస్ మండల సమావేశంలో పాల్గొని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులుగా గంగాధర్ లక్ష్మికాంత్ ఉపాధ్యక్షులుగా గంట రవి శంకర్ కార్యదర్శిగా కొమ్ము సురేష్ కోశాధికారిగా మాదాసు దయాకర్, ఎం ఎస్ పిమండల అధ్యక్షులుగా మహాకాలి విశ్వనాద్ ను ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ పి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చింత వినయ్ బాబు మాదిగ జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులు మాదిగ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు తుంగతుర్తి నియోజకవర్గ ఇంచార్జీ పాల్వాయి బాలయ్య ఎంఇఎప్ జిల్లా కార్యదర్శి ఇరుగు సోమయ్య మాదిగ కళా మండలి మండల అధ్యక్షుడు ఇరుగు వెంకన్న వివిధ గ్రామాల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైన్ షాపుల ముందు అక్రమ పార్కింగ్‌లను అరికట్టాలి

**సిపిఎం పార్టీ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్**

**రాజేంద్రనగర్ డీసీపీకి కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు**




**గండిపేట్(క్రైం మిర్రర్):** వైన్స్ షాపుల ముందు అక్రమ పార్కింగ్‌లు పెరిగిపోయి ప్రజలకు తీవ్ర ఇబ్బందికరంగా మారుతున్నాయని సిపిఎం పార్టీ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ అన్నారు. ఈ మేరకు సిపిఎం పార్టీ రాజేంద్రనగర్ మండల కమిటి సభ్యులు జి.ఎం.కురుమయ్య అధ్యక్షతన రాజేంద్రనగర్ డీసీపీని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం జాజాల రుద్రకుమార్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఉన్న రోడ్లపై వైన్‌షాపుల ముందు అక్రమంగా ఓనర్స్ పార్కింగ్ చేస్తూ ట్రాపిక్ అంతరాయం కలిగిస్తున్నారన్నారు. వైన్ షాపుల దగ్గర ఉన్న అక్రమ పార్కింగ్‌ను తొలగించాలని అదే విధంగా అనేక బడుగు, బలహీన వర్గాల ప్రజలు నివసించే బాబుల్ రెడ్డి నగర్, శాస్త్రీపురం, వట్టెపల్లి, పద్మశాలిపురం, కాటేదాన్ ఇండస్ట్రీయల్, బుద్వేల్ రైల్వే స్టేషన్, వెంకటేశ్వర కాలనీ, నేతాజీనగర్, శ్రీరామ్‌నగర్ కాలనీల్లో గంజాయి విచ్చలవిడిగా అమ్ముడవుతుందన్నారు. ప్రశ్నించే వారిపై దాడులు జరుగుతున్నాయన్నారు. వీటిని నివారించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటి సభ్యులు ఎన్.జంగయ్య, బచ్చులకూర స్వామి, సిపిఎం పార్టీ కార్యకర్తలు మన్యం, యాదగిరి, మండల కార్యదర్శి బి.వెంకటయ్య, శాంతి, కిరణ్, ఉమర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.






## ఘనంగా శ్రీనివాసరామానుజన్ జయంతి వేడుకలు

**గండిపేట్(క్రైం మిర్రర్):** గణిత అపరమేధావి శ్రీనివాస రామానుజన్ 137వ జయంతి వేడుకలు పి.ఎస్.శ్రీ రాంనగర్ పాఠశాలలో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలలో క్వీజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సుగుణ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గణిత ఉపాధ్యాయుడు జె.శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం శంకర్, ఉపాధ్యాయులు లత, ఆశాజ్యోతి, షేక్ అల్లావలి, ముస్తాఫా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జయప్రకాష్ కి ఉత్తమ అధికారి పురస్కారం



**మందమర్రి టౌన్ డిసెంబర్ 23 క్రైమ్ మిర్రర్:** మందమరి ఏరియాలో సివిల్ విభాగంలో పనిచేస్తున్న జయప్రకాష్ ఉత్తమ అధికారిగా ఎంపిక అవడం సంతోషకరమైన విషయమై సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా మందమరిలో ఉంటూ ఏరియా కార్మికులకు సేవలందిస్తున్న జయప్రకాష్ కు ఉత్తమ అధికారిగా అవార్డు అందజేయడం గొప్ప విషయం అని పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో మరింత ఉన్నత పదవులు పొందాలని ఆయనకు దేవుడు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలను ఆయురారోగ్యాల ప్రసాదించాలని వారు సూచించారు. నిరంతరం కార్మికుల సమస్యలను పరిష్కరిస్తూ అంకిత భావంతో పనిచేస్తూ ముందుకు సాగుతున్న జయప్రకాష్ రాబోయే రోజుల్లో ఇంకా మంచి పదవులు పొందాలని కోరుకుంటున్నామని తెలియజేశారు.



## ఘనంగా పి.వి.నర్సింహ్మారావు వర్ధంతి

**గండిపేట్(క్రైం మిర్రర్):** బహుభాషా కోవిదుడు, భారత దేశ మాజీ ప్రధాని దింగత పి.వి.నర్సింహ్మారావు వర్ధంతి కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయి. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు.

## సీఎం కప్ కబడ్డీ టోర్నమెంట్‌లో రాజేంద్రనగర్ మండలానికి తృతీయ బహుమతి







గండిపేట్(క్రైం మిర్రర్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ఉత్తమ శిక్షణ తీసుకోని రాణించాలని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ అన్నారు. సీఎం కప్ రంగారెడ్డి జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో రాజేంద్రనగర్ మండలం టీమ్ తతీయ బహుమతి కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను సోమవారం అభినందించారు. అలాగే మహారాష్ట్రాలో అమరావతి పేరుతో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ఎస్‌జీఎఫ్‌లో శివరాంపల్లి పాఠశాల విద్యార్థిని సబా అన్సారి పాల్గొని విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. ఇలాంటి పోటీల్లో పాల్గొనడం వల్ల మరింత నైపుణ్యవంతులుగా ఎదుగుతారన్నారు. అలాగే రవి బ్రిలియంట్ పాఠశాల నుంచి సీఎం కప్ జిల్లా జట్టుకు కిమ్‌కల, కబడ్డీ, ఖోఖోలో చంద్రకళలు ఎంపికైయ్యారని పాఠశాల జోనల్ ఇన్‌చార్జ్ కె.గాంగ్యనాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శివరాంపల్లి హెచ్ఎం కిషన్, సుదర్శన్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# బడంగ్పేట్ కార్పొరేషన్ లో పర్యటించిన హైడ్రా అధికారులు

**స్థలాల ఆక్రమణ పై పత్రిక ముఖంగా, కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించిన స్పందించని మేయర్, కమిషనర్ : చెరుకుపల్లి వెంకటరెడ్డి**

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ లో లేఔట్లలో, కాలనీలలోని ఓపెన్ స్థలాలు, పార్కు స్థలాలు ఆక్రమణకు గురి అవుతున్నాయని వాటికి సంబంధించిన అన్ని వివరాలతో ఈనెల 16న హైడ్రా కమిషనర్ కి బడంగ్పేట్ కార్పొరేషన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి ఫిర్యాదు చేయడం జరిగింది. ఫిర్యాదులో భాగంగా కార్పొరేషన్ కు సంబంధించినటువంటి ఔట్సోర్సింగ్ సిబ్బందితో హైడ్రా అధికారులు కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ఆక్రమణకు గురవుతున్న ఓపెన్ స్థలాలు పార్కు స్థలాలతోపాటు అనధికార నిర్మాణ ప్రదేశాలను పరిశీలించి ప్రాథమిక విచారణ జరిపారు. బడంగ్పేట్ కార్పొరేషన్ లో ఎంతో కాలంగా ప్రభుత్వ స్థలాలు, పార్కు స్థలాలు, ఓపెన్ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని కార్పొరేషన్ కమిషనర్, మేయర్, టిపిఓ కు ఫిర్యాదు చేయడమే కాకుండా పలుమార్లు పత్రిక ముఖంగా కూడా పూర్తి వివరాలతో కూడిన సమాచారం వెల్లడించిన ఇప్పటివరకు కూడా కమిషనర్, మేయర్ అక్రమ నిర్మాణాలపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడమే కాకుండా వారిపై వచ్చిన ఆరోపణలకు కనీసం సమాధానం కూడా ఇవ్వలేకపోతున్నారని ఇదే అంశంపై గత కౌన్సిల్ సమావేశంలో ప్రతిపక్ష పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అక్రమాలపై ప్రశ్నించడం కూడా జరిగిందని, ఎన్నోసార్లు వ్రాతపూర్వకంగా పత్రికా ముఖంగా కూడా పూర్తి వాస్తవాలతో కూడిన విషయాలను వెల్లడించిన కూడా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో హైడ్రా కమిషనర్ కి ఫిర్యాదు చేయడం జరిగిందని అందులో భాగంగానే హైడ్రా అధికారులు కార్పొరేషన్ టిపిఓ అందుబాటులో లేకుండా కూడా ఔట్సోర్సింగ్ సిబ్బందితో ప్రాథమిక విచారణ చేపట్టారని చెరుకుపల్లి వెంకటరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.


The Respected Commissioner,
Hyderabad Disaster Response and Assets Monitoring and Protection [HYDRA],
Government of Telangana,
Hyderabad.

Respected Sir,

**Sub: Urgent request for protection of open spaces, par[k] in GP Layouts, Govt. Lands and irrigation nalas Badangpet corporation – Reg**

['m] writing to urgently bring to your attention a critical iss[ue] [r]egarding the encroachment of open space and parks locat[ed] [a]t Badangpet Muncipal Corporation, the encroachment [a]ffecting the following survey numbers.

1. 5100 Sq.Yards in four places in survey numbe[r] 743,747,748,749 and 750 layout in municipal colony Nadergul revenue.
2. 2188 Sq.Yards in survey number 79 & 80 Maruthina[gar] layout in Badangpet revenue.
3. 1911 Sq. Yards in 3 places survey numbers 139 & 1[…] MCR Colony layout in Badangpet revenue.
4. 679 Sq. Yards in survey numbers 756 & 776 in Gaya[…] Hills layout of Nadergul revenue.
5. Park area in survey numbers 787,788,789 and 790 Ba[…] Nagar layout in Nadergul revenue.

Contd.,

4003
16/12/24



# ఆగండి.. తొందరొద్దు

## ఆరోగ్య బీమా క్లెయిముల్లో తెలివిగా వ్యవహరించండిలా

ప్రస్తుతం ఆరోగ్య బీమాపై అందరిలోనూ అవగాహన పెరిగింది. ఎప్పుడు, ఎవరికి ఏమవుతుందో తెలియని పరిస్థితుల్లో ఉన్న మనకు బీమా.. కొండంత అండగానే చెప్పాలి. అయితే ఈ బీమా క్లెయిముల్లో మాత్రం చాలామంది తొందరపాటుతో వ్యవహరిస్తున్నారు. దీంతో బీమా ప్రయోజనాలను పాలసీదారులు పెద్ద మొత్తంలో కోల్పోవాల్సి వస్తున్నది. ముఖ్యంగా ఈ శీతాకాలంలో శ్వాసకోశ, చర్మ సంబంధ సమస్యలు, ఇన్ఫెక్షన్లు సహజం. అందుకే కంగారుపడి ప్రతీ చిన్న అవసరానికీ బీమానే ప్రత్యామ్నాయంగా చూడవద్దు. క్లెయిములకు వెళ్లవద్దు. అనారోగ్యం బారినపడకుండా తగు జాగ్రత్తలు తీసుకోండి. సమస్య ముదిరితే వైద్యుల సలహా మేరకే పెద్ద ఖర్చులకు మాత్రమే బీమాను వినియోగిస్తే మంచిది. అసలు ఆరోగ్య బీమాలో క్లెయిములు లేకపోతే వచ్చే లాభాలెంటో తెలుసా?




**నో-క్లెయిం బోనస్**

ఆరోగ్య బీమా తీసుకున్నాక తర్వాతి రెన్యువల్ వరకు ఆ బీమాను ఉపయోగించకపోతే.. అందుకుగాను బీమా సంస్థలు పాలసీదారులకు ఇచ్చే ప్రోత్సాహకాలే ఈ నో-క్లెయిం బోనస్‌లు. వీటిలో క్యుములేటివ్ బోనస్, ప్రీమియంపై డిస్కౌంట్లుంటాయి.

**క్రమేణా పైపైకి**

తొలి సంవత్సరం ఎలాంటి క్లెయిములు లేకపోతే మలి సంవత్సరం పాలసీ తీసుకునేటప్పుడు అంతే మొత్తానికి బీమా కవరేజీ 10 శాతం మేర పెరుగుతుంది. ఉదాహరణకు రూ.20 వేలు చెల్లించి రూ.20 లక్షల పాలసీని తీసుకున్నారు. తొలి ఏడాది కాలంలో ఏ క్లెయిం చేయలేదు. దీంతో రెండో ఏడాదీ అదే రూ.20 వేలకు రూ.22 లక్షల బీమా కవరేజీ లభిస్తుంది. ఇక్కడ నో-క్లెయిం బోనస్ రూ.2 లక్షలు (10 శాతం) అన్నమాట. ఇలా తర్వాతి సంవత్సరాల్లోనూ రూ.2 లక్షల చొప్పున బీమా కవరేజీ పెరుగుతూపోతుంది. వీటినే క్యుములేటివ్ బోనస్‌లు అంటారు.

**రాయితీలుజి**

ప్రతి సంవత్సరం క్లెయిములు లేకపోతే ఆ పాలసీదారులకు ఇన్సూరెన్స్ సంస్థలు.. బీమా ప్రీమియంలపై రాయితీలనూ అందిస్తాయి. రెన్యువల్ సమయంలో ఈ తగ్గింపులను అందుకోవచ్చు. ఉదాహరణకు రూ.20 లక్షల ఆరోగ్య బీమాను రూ.20 వేలు పెట్టి తీసుకున్నారు. తొలి ఏడాది ఎలాంటి క్లెయిం చేయలేదు. దీంతో మీ ప్రీమియంలో 10 శాతం తగ్గింపు లభిస్తుంది. అంటే తర్వాతి సంవత్సరం రూ.18 వేలు చెల్లిస్తే చాలు. రూ.20 లక్షల కవరేజీ వస్తుంది. ఇలా తర్వాతి సంవత్సరాలకూ నిబంధనలకు లోబడి 10 శాతం తగ్గింపులు వర్తిస్తాయి.

**చివరగా..**

చిన్నచిన్న వాటికే క్లెయిములు చేస్తే ఆరోగ్య బీమా ద్వారా పొందే ప్రయోజనాలను కోల్పోవాల్సి వస్తుంది. జలుబు, దగ్గు, జ్వరాలు, ఇతరత్రా సీజనల్ వ్యాధులకు ఆరోగ్య బీమాలను ఉపయోగించుకోవడం మానేయండి. పెద్ద సమస్యలు ఎదురైతేనే బీమాను వాడుకోండి. అలాగే ఆరోగ్యంగా ఉన్నప్పుడే బీమాలను తీసుకోండి. బీపీ, షుగర్ వంటివి వచ్చాక తీసుకుంటే ప్రయోజనాలకు కోతలు తప్పవు. ఆరోగ్య బీమా తీసుకునేటప్పుడు వాస్తవాలను వెల్లడించండి. ప్రీమియంలను రెగ్యులర్‌గా చెల్లించండి. నిజాలను దాస్తే ఇబ్బందులు తప్పవు. నో-క్లెయిం బోనస్‌లు.. ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్లు, ఇండివీద్యువల్ హెల్త్ ఇన్సూరెన్స్‌లకూ వర్తిస్తాయి.



# జీఎస్టీ మినహాయింపు వీటిపైనే?




వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలులోకి వచ్చిన ఏడు సంవత్సరాల తర్వాత మొదటిసారి పన్ను రేట్లలో భారీ మార్పులు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే దీనిపై తుది నిర్ణయం ఈనెల 21న జరిగే 55వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో వెలువడుతుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరగబోయే ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక మంత్రులు పాల్గొననున్నారు. ఈ సమావేశం రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో నిర్వహిస్తున్నారు. ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం ఈ సమావేశంలో తీసుకుబోయే నిర్ణయాలు కింది విధంగా ఉంటాయని ఊహాగానాలు వస్తున్నాయి.

- జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీ రేట్లను తగ్గించే ప్రతిపాదనలున్నాయి.
- సీనియర్ సిటిజన్లు చెల్లించే ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీ మినహాయింపు.
- సీనియర్ సిటిజన్లు కాకుండా ఇతర వ్యక్తులకు రూ.5 లక్షల వరకు కవర్ చేసే పాలసీలకు ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీ మినహాయింపు.
- రూ.5 లక్షల కంటే ఎక్కువ కవరేజీ ఉన్న పాలసీల ప్రీమియంలపై 18% జీఎస్టీ కొనసాగిస్తారని అంచనా.

**మార్పులు..**

- జీఎస్టీ హేతుబద్ధీకరణపై మంత్రుల బృందం విలాసవంతమైన వస్తువులు, సిన్ గూడ్స్ (అత్యంత ఖరీదైన దిగుమతి చేసుకునే వస్తువులు)పై పన్ను పెంచుతారు.
- చేతి గడియారాల ధర రూ.25,000 ఉంటే జీఎస్టీ 18% నుంచి 28%కి పెంపు.
- రూ.15,000 కంటే ఎక్కువ ధర ఉన్న షూస్‌పై జీఎస్టీ 18% నుంచి 28%కి పెంపు.
- రూ.1,500 వరకు ధర ఉన్న రెడీమేడ్ దుస్తులపై 5% జీఎస్టీ.
- రూ.1,500-రూ.10,000 మధ్య ధర ఉన్న దుస్తులపై 18% జీఎస్టీ.
- రూ.10,000 కంటే ఎక్కువ ధర ఉన్న రెడీమేడ్ దుస్తులపై 28% జీఎస్టీ.
- కొన్ని పానీయాలు, సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న 28% జీఎస్టీను కొత్తగా 35% స్లాబ్‌లో?కి తీసుకురాబోతున్నట్లు అంచనా.

**పన్ను తగ్గింపు..**

- ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ (20 లీటర్లు, అంతకంటే ఎక్కువ)పై జీఎస్టీ 18% నుంచి 5%కి తగ్గింపు.
- రూ.10,000 కంటే తక్కువ ధర ఉన్న సైకిళ్లపై జీఎస్టీ 12% నుంచి 5%కి తగ్గింపు.
- నోట్‌బుక్‌లపై 12% నుంచి 5%కి తగ్గింపు.



# మార్కెట్‌పై బేర్ పట్టు

### మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లలో నష్టపుటేరులు పారుతున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ కఠిన ద్రవ్య వైఖరి దిశగా అడుగులు వేస్తుండటం మదుపరులకు అస్సలు రుచించడం లేదు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ ఏకంగా 4,091.53 పాయింట్లు లేదా 4.98 శాతం కోల్పోయి 79వేల మార్కుకు దిగువన 78,041.59 వద్ద ముగిసింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 1,180.80 పాయింట్లు లేదా 4.76 శాతం దిగజారి 24వేల మార్కును చేజార్చుకొని 23,587.50 దగ్గర స్థిరపడింది. దీంతో ఈ వారం కూడా ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడికే లోను కావచ్చున్న అంచనాలున్నాయి. ఫలితంగా ప్రధాన రంగాల్లో లాభాల స్వీకరణకు వీలుందంటున్నారు. ఇక ఈ వారం డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు కూడా ప్రధానమే. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ ముఖ్యమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,000 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,900-24.100 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**గమనిక..**

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

# పరుగులు పెట్టే రోబో.. మైండ్ బ్లోయింగ్



సూపర్ స్టార్ 'రజనీ కాంత్' రోబో సినిమా వచ్చిన తరువాత.. బహుశా రోబోలు ఇలాగే ఉంటాయేమో అని చాలామంది భావించారు. అయితే ఇటీవల టెస్లా రూపొందించిన నడిచే రోబోకు సంబందించిన వీడియో కూడా నెట్టింట్లో వైరల్ అయింది. ఇప్పుడు చైనా కంపెనీ ఏకంగా పరుగెత్తే రోబోను తయారు చేసింది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు ఈ కథనంలో చూసేద్దాం. చైనీస్ కంపెనీ 'రోబో ఎరా' ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన హ్యూమనాయిడ్ రోబోను తయారు చేసింది. 'స్టార్1' పేరుతో రూపొందించిన ఈ రోబో శరవేగంగా పరుగులు తీయగలదు. ఇది గంటకు 8 మైళ్లు (12.98 కి.మీ.) వేగంతో పరుగెడుతోంది. ఈ రోబోకు హైటార్క్ మోటార్లు, ఏఐ సెన్సార్లు అమర్చడం వల్ల.. ఇది ఎలాంటి ఎగుడు దిగుడు దారుల్లోనైనా అదే వేగంతో పరుగెతూనే దాటేస్తుంది. 'రోబో ఎరా' చూడటానికి సగటు మనిషి పరిమాణంలోనే 5.6 అడుగుల ఎత్తు, 64.86 కేజీల బరువుతో ఉంటుంది. ఇలాంటి పరుగుల రోబోలను 'టెస్లా' కంపెనీ 'ఆప్టిమస్' పేరుతోను, 'బోస్టన్ డైనమిక్స్' కంపెనీ 'అట్లాస్' పేరుతోను రూపొందించాయి. అయితే, 'రోబో ఎరా' తాజాగా రూపొందించిన 'స్టార్ 1' వాటి కంటే వేగంగా పరుగులు తీయగలగడంతో, అత్యంత వేగవంతమైన రోబోగా రికార్డు సాధించింది.

# సైబర్ నేరాలపై వినూత్నంగా అవగాహన

దేశంలో సైబర్ నేరాలు అంతకంతకూ పెరుగుతుండడంతో టెలికం శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. కాలర్ ట్యూన్స్ ద్వారా సైబర్ నేరాలపట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని నడుం బిగించింది. ఈ మేరకు టెలికం కంపెనీలకు ఆదేశాలు వెలువరించింది. ఈ ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని టెల్కోలను ఆదేశించింది. హోమ్ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ సైబర్‌క్రైమ్ కో%-%ఆర్డినేషన్ సెంటర్ ఈ కాలర్ ట్యూన్స్‌ను టెలికం కంపెనీలకు అందిస్తుంది. టెలికం కంపెనీలు మొబైల్ కస్టమర్లకు ప్రతిరోజు 8%-%10 కాల్స్‌కు ఈ సందేశాన్ని వినిపిస్తాయి. ప్రతి వారం కాలర్ ట్యూన్‌ను మారుస్తారు. ఇలా మూడు నెలలపాటు కాలర్ ట్యూన్స్ ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కొన్ని కాల్స్ భారత్‌లో నుంచే వచ్చినట్లు కనిపిస్తాయి. వాస్తవానికి అందులో చాలా వరకు అంతర్జాతీయ స్పూఫ్డ్ ఇన్‌కమింగ్ కాల్స్ ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వాటిని వెంటనే గుర్తించి బ్లాక్ చేసే వ్యవస్థను కేంద్రం, అలాగే టెలికం సర్వీస్ ప్రొవైడర్లు రూపొందించారు. ఇటీవల నకిలీ డిజిటల్ అరెస్టులు, ఫెడెక్స్ స్కామ్‌లు, ప్రభుత్వం, పోలీసు అధికారులుగా నటించడం మొదలైన కేసులలో సైబర్ నేరస్థులు ఇటువంటి అంతర్జాతీయ స్పూఫ్డ్ కాల్స్ చేసినట్టు ప్రభుత్వం గుర్తించింది.

# సింగరేణి డే న నిరసనతో హోరెత్తించిన కాంట్రాక్టు కార్మికులు

## సింగరేణి యాజమాన్యం స్పందించకుంటే మరో పోరాటానికి సైతం సిద్ధం

## గట్టు మహేందర్ ఎస్ ఆర్ పి సింగరేణి కాం(ట్రాక్టు కార్మిక సంఘం కార్యదర్శి

మంచిర్యాల ప్రతినిధి (క్రైమ్ మిర్రర్): సింగరేణి వ్యాప్తంగా అన్ని విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పట్ల సింగరేణి యాజమాన్యం వివక్షను వీడాలని, చేసిన అగ్రిమెంట్ అంశాలను అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని డిసెంబర్ 23 సింగరేణి డే ఉత్సవాల సందర్భంగా నిరసన కార్యక్రమాలు చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం శ్రీరాంపూర్ లో అన్ని విభాగాలలో కాంట్రాక్టు కార్మికులు నిరసన బ్యాడ్జిలను ధరించి విధులను నిర్వహిస్తూ, నిరసన చేయడంలో విజయవంతంగా కార్మిక వర్గం కదిలింది. ఈ సందర్భంగా గట్టు మహేందర్ ఎస్సీ కేవస్ డివిజన్ కార్యదర్శి, కాసీపేట రాజేశం సహాయ కార్యదర్శి లు మాట్లాడుతూ... ఒకే కుటుంబం, ఒకే గమ్యం, ఒకే లక్ష్యం అనే నిదానదంతో ఈరోజు సింగరేణి యాజమాన్యం సంస్థను ముందుకు నడుపుతుంది. కానీ వాస్తవంగా సింగరేణిలో అధికారుల కుటుంబం వేరు, పర్మినెంట్ కార్మికుల కుటుంబం వేరు, కాంట్రాక్టు కార్మికుల కుటుంబం వేరు లాగా యాజమాన్యం వ్యవహరిస్తుంది. కాంట్రాక్టు కార్మికులంటే బానిసలుగా, రెండవ తరగతి పౌరులుగా అడుగడుగునా వివక్షతని చూపిస్తుందిఅని ఆరో పించారు, కోల్ ఇండియా వేతనాలు అమలులో, కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించడంలో, క్యాంటీన్ సౌకర్యం ఇప్పించడంలో, పండగ, జాతీయ సెలవులు అమలులో, వృత్తి పన్ను మినహాయింపులు, ఖాళీ క్వార్టర్లు ఇప్పించడంలో, కేటగిరి ఆధారంగా వేతనాలు ఇవ్వడంలో, మైన్స్ చట్టం, కాంట్రాక్ట్ లేబర్ చట్టం, ఇతర చట్టాల అమలు, స్వీట్స్ పంపిణీలో, వేతనాలను సకాలంలో చెల్లించడంలో, ఇలా ప్రతి విషయంలో కాంట్రాక్టు కార్మికుల పైన యాజమాన్యం వివక్షను, నిర్లక్ష్యమే ప్రదర్శిస్తుంది అని ఆవే ద న వ్యక్తం చే సారు,

ఇవి కొన్ని మచ్చుకు మాత్రమే. ఇలా అడుగడుగునా కాంట్రాక్టు కార్మికులపై సింగరేణి యాజమాన్యం వివక్షను, నిర్లక్ష్యాన్ని పాటిస్తుంది. , వారి వేతనాలు పెంచే విషయంలో వారి, సమస్యలు పరిష్కరించడంలో మాత్రం ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 23వ తేదీన సింగరేణి వ్యాప్తంగా సింగరేణి డే సందర్భంగా నల్ల బ్యాడ్జీలు నిరసన డిమాండ్ల బ్యాడ్జీలతో కాంట్రాక్టు కార్మికులు నిరసన తెలియజేయాలని ఇచ్చిన పిలుపుకు చాలా పెద్ద ఎత్తున కార్మిక వర్గం






ఆలోచించి నిరసనలను విజయవంతం చేయడం జరిగింది ,ఈ కార్యక్రమాలలో పాల్గొన్న అన్ని విభాగాల కార్మిక వర్గానికి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియుగా విప్లవ వందనాలు తెలియజేస్తున్నాం. అలాగే సింగరేణి యాజమాన్యం ఇప్పటికైనా కాంట్రాక్టు కార్మికుల విషయంలో స్పందించి, సమస్యలు పరిష్కరించే దిశగా ముందుకు రావాలని, లేని యెడల మరో మహత్తర పోరాటానికి సైతం కార్మిక వర్గాన్ని సిద్ధం చేస్తామని వెల్లడించారు, రాష్ట్ర ప్రభుత్వం సైతం దృష్టి సారించాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.



## క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే

**పిట్లం క్రైమ్ మిర్రర్ :** కామారెడ్డి జిల్లాలో నిర్వహించిన సీఎం కప్ కబడ్డీ పోటీల్లో పిట్లం మండల క్రీడాకారులు ప్రథమ స్థానంలో విజేతలుగా నిలిచారు.ఈ సందర్భంగా సోమవారం పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు కబడ్డీ టీం సభ్యులను అభినందించి,బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,పిట్లం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నారేగూడలో మైసమ్మ,ఊరడమ్మలకు బోనాలు...!



**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** వైభవంగా మైసమ్మ.ఈదమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం నారేగూడ గ్రామంలో వైభవంగా కొనసాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా సోమవారం మైసమ్మ,ఊరడమ్మ అమ్మవార్లకు మహిళలు బోనాలను డప్పుచప్పుల్ల మధ్య ఊరేగింపుగా వెళ్లి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మా గ్రామంలో జరుగుతున్న ఉత్సవాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా దివిజయంగా ముందుకు సాగేలా ఆశీర్వదించండమ్మా తల్లులు అంటూ మహిళలు,గ్రామస్తులు కోరుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పర్మయ్య,తిరుపతి రెడ్డి,గ్రామ పెద్దలు రఘునందరెడ్డి, నాగిరెడ్డి,మైపాల్ రెడ్డి,అనంతయ్య,హన్మయ్య,శివరాజ్,శేఖర్ రెడ్డి,గోపాల్, బాలరాజ్,దేవకుమార్,రాజు,కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## దొంతాన్ పల్లి ప్రభుత్వ పాఠశాలలో విషస్ ట్రీ సెలబ్రేషన్స్లి

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** ఐ ఎఫ్ హెచ్ ఈ క్యాంపస్ లో సంకల్ప క్లబ్ ,నేషన్ బిల్డింగ్ క్లబ్ ఆధ్వర్యంలో దొంతాన్ పల్లి ప్రభుత్వ పాఠశాలలో క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా “విషింగ్ ట్రీ” పేరున కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాధవి గరికపర్తి ( స్టూడెంట్ ఆక్టివిటీ కోఆర్డినేటర్ ఆఫ్ ఐ ఎఫ్ హెచ్ ఈ , సంకల్ప్ క్లబ్ మెంబర్ మార్గదర్శకాలతో జైనం షా, వరుణ్ షా, మయూరీల పర్యవేక్షణలో జరిగినది. నౌలెడ్జి షేరింగ్ సెషన్లో, క్లబ్ సంకల్ప్ సభ్యులు స్కూల్ విద్యార్థులతో కలసి విషస్ ట్రీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వారికీ బహుమతులు అందచేయడం తో వారి ముఖాలలో అవధులు లేని ఆనందం కనిపించిందని క్లబ్ సభ్యులు తెలిపారు.. సభ్యులు పిల్లలకు అల్పాహారం కూడా అందజేశారు. ఆనందంనిండిన వారి ముఖాలు సభ్యుల మనసుకు సంతోషాన్ని కలిగించాయని తెలిపారు. క్రిస్మస్ వేడుకలలో క్లబ్ సంకల్పు భాగ్యస్వామ్యాన్ని కలిపించిన దొంతనపల్లి ప్రభుత్వ పాఠశాల యాజమాన్యానికి ఈ కార్యక్రమానికి తమవంతు కృషి చేసి, సహకరించిన వారందరికీ సంకల్ప్ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకున్నారు.ఈ విషింగ్ ట్రీ కార్యక్రమం కొన్ని హృదయాలను కదలించే కథలు , మరిచిపోలేని సంఘటనలను అందించిందని క్లబ్ సంకల్ప్ యొక్క ఈ చొరవ నిజంగా స్ఫూర్తిదాయకం మరియు ప్రశంసనీయమని పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు.




# మిర్యాలగూడలో ట్రాఫిక్ సమస్యలపై అవగాహన ర్యాలీ





**క్రైమ్ మిర్రర్,మిర్యాలగూడ:** మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) ఆదేశాల మేరకు పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ట్రాఫిక్ నియంత్రణకు అవగాహన కల్పించే ఉద్దేశంతో సోమవారం మున్సిపల్ సిబ్బంది, పోలీస్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంఘాల నాయకుల సమక్షంలో ట్రాఫిక్ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ ఫ్లైఓవర్ నుండి బస్టాండ్, డాక్టర్స్ కాలనీ, గణేష్ మార్కెట్, పెద్ద బజార్ గుండా రాజీవ్ చౌక్ మీదుగా కూరగాయల మార్కెట్, తిరిగి బస్టాండ్ వరకు జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..మిర్యాలగూడ పట్టణంలో జనాభా, వ్యాపారాలు పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు మరింత తీవ్రంగా మారుతున్నాయని తెలిపారు. గత పాలన వైఫల్యాలను విమర్శించటం కాకుండా, సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలు, వ్యాపారస్తులు, ప్రయాణికులు పోలీసులకు, మున్సిపల్ అధికారులకు సహకరించాలని, అందరి భాగస్వామ్యంతోనే సమస్యను సులభంగా పరిష్కరించగలమని అన్నారు.గత నెల రోజులుగా పోలీసులు, మున్సిపల్ అధికారులు రోడ్లపై ఉన్న వ్యాపారస్తులకు సూచనలు చేస్తూ ట్రాఫిక్ సమస్యను తగ్గించే చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ ప్రయత్నాలు తాత్కాలికంగా కొందరికి ఇబ్బందిగా అనిపించవచ్చు కానీ దీని ఫలితాలు భవిష్యత్తులో మెరుగ్గా ఉంటాయని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ ర్యాలీలో డీఎస్పీ కె. రాజశేఖర్ రాజు, మున్సిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, కౌన్సిలర్లు, వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ర్యాలీ విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

## లేని చర్చికి ప్రజా ప్రతినిధుల నుండి ప్రోసిడింగ్ కాపీలు తీసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ

### అడిషనల్ కలెక్టర్కు కు ఫిర్యాదు చేసిన, హిందూ సంఘాలు నాయకులు...



**జగిత్యాలజిల్లా ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** జగిత్యాల జిల్లా రాయపట్నం గ్రామంలో అవునూరి యేసయ్య లక్షట్ పేట్ గ్రామస్తుడు డైన అన్యమత ప్రచారం చేస్తూ బలవంతపు మతమార్పిడులకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ గ్రామంలో లేనటువంటి చర్చి కొరకై ప్రజాప్రతినిధులను తప్పు ద్రోవ పట్టిస్తూ చర్చి నిర్మాణం కై ప్రొసైడింగ్ కాపీలను మంజూరు చేపించుకుంటు ప్రజలను మరియు ప్రజా ప్రతినిధులను మోసం చేస్తున్న డాని అవునూరి యేసయ్య పై చట్టరీత్యా చర్యలు తీసుకోగలరని కోరుతూ సోమవారం జగిత్యాల అడిషనల్ కలెక్టర్ గౌతమ్ రెడ్డికి ఫిర్యాదు చేసిన హిందూ సంఘాల నాయకులు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, హిందు వాహిని నాయకులు వేముల సంతోష్, జిట్ట వేణి అరుణ్ కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు..

## తాహసిల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం

**పిట్లం క్రైమ్ మిర్రర్ధ్:** కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమన్ని నిర్వహించినట్లు పిట్లం మండల తహసిల్దార్ వేణుగోపాల్ తెలిపారు.ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ...ప్రజావాణి కార్యక్రమంలో ఏలాంటి ఫిర్యాదులు రాలేవని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ నారాయణ,ఎంపీడీవో కమలాకర్,ఎంపీఓ యాదగిరి,ఆయా శాఖల మండల అధికారులు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# రోహిత్‌కు గాయం



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాతో కీలకమైన బాక్సింగ్ డే టెస్టుకు ముందు భారత్‌కు ఎదురుదెబ్బ. ఆదివారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో కెప్టెన్ రోహిత్‌శర్మ గాయపడ్డాడు. ప్రాక్టీస్ పిచ్‌లపై త్రోడౌన్ స్పెషలిస్టు దయానంద్ గరానీ వేసిన బంతిని ఆడే క్రమంలో రోహిత్ ఎడమ కాలికి గాయమైంది. నొప్పితో బాధపడుతూ కనిపించిన హిట్‌మ్యాన్ ఐస్‌ప్యాక్‌తో కొద్దిసేపు సేదతీరాడు.

అయితే గాయం తీవ్రతపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. ప్రాక్టీస్ సెషన్ ముగిసిన తర్వాత పేసర్ ఆకాశ్‌దీప్‌సింగ్ మాట్లాడుతూ రోహిత్ ప్రస్తుతం బాగానే ఉన్నాడని పేర్కొన్నాడు. సోమవారం ప్రాక్టీస్‌కు విశ్రాంతి అని తెలిపాడు. ఇదిలా ఉంటే ప్రాక్టీస్ కోసం కేటాయించిన పిచ్‌లు మరీ నాసిరకంగా ఉన్నట్లు టీమ్‌ఇండియా క్రికెటర్లు వాపోయారు. అసలు ఏమాత్రం బ్యాటింగ్‌కు అనుకూలంగా లేవని అన్నారు.



## దుబాయ్‌లో భారత్ మ్యాచ్‌లు

కరాచీ: ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో భారత్ మ్యాచ్‌లు దుబాయ్‌లో జరిగే అవకాశం కనిపిస్తున్నది. యూఏఈ క్రికెట్ బోర్డుకు చెందిన షేక్ నహ్యాన్ అల్ ముబారక్‌తో ఆదివారం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) చీఫ్ మోహిసిన్ నఖ్వి చర్చలు జరిపారు. ఇందులో తటస్థ వేదికగా దుబాయ్ వైపు పీసీబీ మొగ్గుచూపినట్లు తెలిసింది. హైబ్రిడ్ మోడల్‌లో భాగంగా టీమ్‌ఇండియా.. పాకిస్థాన్‌లో కాకుం డా తటస్థ వేదికపై మ్యాచ్‌లు ఆడనుంది. ఒకవేళ భారత్ నాకౌట్‌కు అర్హత సాధిస్తే.. యూఏఈలో సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరుగనున్నాయి.

## అమెరికా కెప్టెన్ అనికకు సన్మానం



హైదరాబాద్: ప్రతిష్ఠాత్మక ఐసీసీ అండర్-19 ప్రపంచకప్‌లో పాల్గొనే అమెరికా మహిళల జట్టు కెప్టెన్ కొలన్ అనికారెడ్డి, లెగ్‌స్పిన్నర్ ఇమ్మడి శాన్విని సెంటర్ ఫర్ క్రికెట్(సీఎఫ్‌సీ) ఎక్సలెన్స్ అకాడమీ ఘనంగా సన్మానించింది. ఆదివారం అకాడమీ నిర్వహకులు భరణి, చీఫ్‌కోచ్ జగదీశ్‌రెడ్డి కలిసి అభినందించారు. అమెరికా అండర్-19 జట్టులో కీలక ప్లేయర్లు ఉన్న వీరు తెలుగు మూలాలు కల్గిన వారు. గత కొద్ది నెలలుగా హైదరాబాద్‌లో ఐసీసీ లెవల్-3 కోచ్ జగదీశ్‌రెడ్డి దగ్గర వీరు శిక్షణ తీసుకుంటున్నారు. వీరికి సీఎఫ్‌సీ నిర్వాహకులు భరణి క్రికెట్ కిట్లను అందజేశారు. భవిష్యత్‌లోమరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## రూట్ రీఎంట్రీ
## ఇంగ్లండ్ వన్డే జట్టుకు ఎంపిక



లండన్: భారత్‌తో వన్డే సిరీస్‌తో పాటు చాంపియన్స్ ట్రోఫీ కోసం ఇంగ్లండ్ ఎంపిక చేసిన జట్టులో స్టార్ బ్యాటర్ జోరూట్ చోటు దక్కించుకున్నాడు. ఆదివారం 15 మందితో ప్రకటించిన జట్టులో రూట్‌కు చాన్స్ ఇచ్చారు. దాదాపు ఏడాది తర్వాత రూట్ తిరిగి జట్టులోకి రానున్నాడు. గాయంతో ఇబ్బంది పడుతున్న స్టార్‌ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌కు జట్టులో చోటు దక్కలేదు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టెస్టులో స్టోక్స్ గాయపడ్డాడు. భారత పర్యటనలో భాగంగా ఇంగ్లండ్ ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌తో పాటు మూడు వన్డేలు ఆడనుంది. బట్లర్ ఇంగ్లండ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

# హర్మన్‌ప్రీత్ సింగ్‌కు ‘ఖేల్‌రత్న’ అవార్డు!

### నామినేషన్లలో కనిపించని మనూ భాకర్ పేరు

### తుది జాబితాలో ఖరారయ్యే అవకాశం!

### తెలంగాణ అథ్లెట్ దీప్తి జివాంజికి ‘అర్జున’



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక జాతీయ క్రీడా పురస్కారాల ప్రకటనకు రంగం సిద్ధమైంది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రహ్మణ్యం నేతృత్వంలోని 12 మంది సభ్యుల సెలక్షన్ కమిటీ అర్జున, ఖేల్‌రత్న, ద్రోణాచార్య, ధ్యాన్‌చంద్ తదితర అవార్డులకు సంబంధించిన నామినేషన్ల జాబితాను ప్రభుత్వానికి అందించింది. మార్పులు లేకుండా దాదాపు ఇదే జాబితా ఖాయమయ్యే అవకాశం ఉంది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పేరును ‘ఖేల్‌రత్న’ పేరు కోసం ప్రతిపాదించారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం గెలుచుకున్న జట్టులోనూ సభ్యుడైన 28 ఏళ్ల హర్మన్‌ప్రీత్... ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడలు, చాంపియన్స్ ట్రోఫీ తదితర ప్రధాన ఈవెంట్లలో భారత్ పతకాలు గెలుచుకోవడంలో కీలకపాత్ర పోషించాడు. హర్మన్‌తో పాటు పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్ పేరును కూడా కమిటీ ‘ఖేల్‌రత్న’ కోసం సిఫారసు చేసింది. పారిస్ పారాలింపిక్స్ హైజంప్ (టి64 క్లాస్)లో ప్రవీణ్ స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో ప్రవీణ్ ఇదే విభాగంలో కాంస్యం సాధించాడు. మరోవైపు పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్యాలు సాధించిన షూటర్ మనూ భాకర్ పేరు ఖేల్‌రత్న జాబితాలో లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. ఒలింపిక్స్‌లో పతకాలు గెలుచుకున్న ప్లేయర్‌గా మరో చర్చ లేకుండా ‘ఖేల్ రత్న’ అవార్డుకు ఆమె అర్హురాలు. అయితే మనూ అవార్డు కోసం దరఖాస్తు చేసుకోలేదని క్రీడా మంత్రిత్వశాఖ వర్గాలు వెల్లడించాయి. దానిని మనూ తండ్రి రామ్‌కిషన్ ఖండించారు. తాను సరైన ఫార్మాట్‌లోనే అప్లికేషన్ అందించామని స్పష్టం చేశారు. ఒకవేళ దరఖాస్తు చేసుకోకపోయినా ... ప్రదర్శనను బట్టి అవార్డుకు ఎంపిక చేసే అధికారం జ్యూరీకి ఉంది. కాబట్టి మనూ సాధించిన ‘డబుల్ ఒలింపిక్ మెడల్’ ఘనతను బట్టి చూస్తే ఆలస్యంగానైనా ఆమె పేరు ఈ జాబితాలో చేరవచ్చు.

**‘అర్జున’ జాబితాలో 30 మంది**

కమిటీ ప్రతిపాదించిన ‘అర్జున’ అవార్డీల జాబితాలో 13 మంది రెగ్యులర్ ఆటగాళ్లు, మరో 17 మంది పారా ఆటగాళ్లు ఉన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో పతకాలు గెలుచుకున్న అమన్ (రెజ్లింగ్), సరబ్‌జోత్, స్వప్నిల్ కుసాలే (షూటింగ్) పేర్లు ఈ జాబితాలో ఉన్నాయి. పారా ఆటగాళ్లలో తెలంగాణకు చెందిన దీప్తి జివాంజికి ‘అర్జున’ దక్కనుండటం విశేషం. వరంగల్ జిల్లాకు చెందిన దీప్తి పారిస్ పారాలింపిక్స్‌లో 400 మీటర్ల పరుగు (టి20)లో కాంస్యం గెలుచుకుంది. అంతకుముందు ఆసియా పారా క్రీడలు, వరల్డ్ చాంపియన్‌షిప్‌లలో ఆమె ఖాతాలో రెండు స్వర్ణాలు ఉన్నాయి. పారా షూటింగ్ కోచ్ సుభాష్ రాణా పేరును ‘ద్రోణాచార్య’ అవార్డు కోసం కమిటీ సిఫారసు చేసింది.



## నేడు సింధు వివాహ రిసెప్షన్... ప్రముఖులు హాజరయ్యే అవకాశం

హైదరాబాద్: భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, వెంకటదత్త సాయి వివాహ వేడుకల్లో భాగంగా నేడు మరో కార్యక్రమం హైదరాబాద్ నగరంలో జరగనుంది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న అన్వయ కన్వెన్షన్స్ వేదికగా మంగళవారం రిసెప్షన్ జరుగుతుంది. దీనికి పెద్ద ఎత్తున క్రీడా, సినిమా, రాజకీయ రంగ ప్రముఖులు హాజరు కానున్నారు. ప్రధాని, ముఖ్యమంత్రి మొదలు సచిన్ టెండూల్కర్ తదితరులను సింధు ఆహ్వానించింది. కుటుంబ సభ్యులు, ఆత్మీయుల మధ్య ఆదివారం రాత్రి రాజస్తాన్‌లోని ఉదయపూర్‌లో సింధు పెళ్లి జరిగింది. అత్యంత సన్నిహితులైన కొందరు అతిథులు మాత్రమే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివాహానికి హాజరైన కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ వధూవరులను ఆశీర్వదించారు. రెండు ఒలింపిక్ స్వర్ణాలు, ఐదు ప్రపంచ చాంపియన్‌షిప్ పతకాలు సహా పలు గొప్ప విజయాలతో భారత అత్యుత్తమ ప్లేయర్లలో ఒకరిగా సింధు గుర్తింపు తెచ్చుకోగా... పొసిడెక్స్ టెక్నాలజీస్ కంపెనీకి దత్తసాయి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

## విధ్వంసం సృష్టించిన సురేశ్ రైనా

బిగ్ క్రికెట్ లీగ్-2024 ఎడిషన్‌లో ఇవాళ (డిసెంబర్ 22) ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. సథరన్ స్పార్టన్స్‌తో జరుగుతున్న అంతిమ పోరులో ముంబై మెరైన్స్ టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకుంది. సథరన్ స్పార్టన్స్‌కు టీమిండియా మాజీ ఆటగాడు సురేశ్ రైనా సారథ్యం వహిస్తుండగా.. ముంబై మెరైన్స్‌కు టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు.

**ఫిల్ మస్టర్డ్ ఊచకోత.. సురేశ్ రైనా విధ్వంసం**

తొలుత బ్యాటింగ్ చేసిన సథరన్ స్పార్టన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ ఫిల్ మస్టర్డ్ (39 బంతుల్లో 78బీ 10 ఫోర్లు, 4 సిక్సర్లు) ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోయగా.. సురేశ్ రైనా (26 బంతుల్లో 51బీ 9 ఫోర్లు, సిక్సర్) విధ్వంసం సృష్టించాడు. స్పార్టన్స్ ఇన్నింగ్స్‌లో సోలొమన్ మైర్ 7, అభిమన్యు మిథున్ 25, ఫయాజ్ ఫజల్ 30, అమాన్ ఖాన్ 10 పరుగులు చేశారు. మెరైన్స్ బౌలర్లలో మన్ప్రీత్ గోని, మనన్ శర్మ తలో రెండు వికెట్లు పడగొట్టగా.. శివమ్ కుమార్ ఓ వికెట్ దక్కించుకున్నాడు.



GHMC
hmda
Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

# డిసెంబర్ 23న జరిగే రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఆశ వర్కర్ల బస్సు జాతను జయప్రదం చేయండి



**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ 18,000/ లు ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలని పీఫ్, ఈ ఎస్ ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 15 నుండి 31తేది వరకు నిర్వహించే రాష్ట్ర బస్సు జాతను జయప్రదం చేయాలని నాంపల్లి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ భవాని కి సోమవారం రోజు కరపత్రం అందజేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ఉపాధ్యక్షురాలు రమావత్ కవిత మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వం ఆశాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, ఆశాల వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కనీస వేతనం 18,000 రూపాయలు పెంచుతామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి ఆశాల ఓట్లతో అధికారంలోకి వచ్చి ఆశల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆశాల సమస్యలు పరిష్కరించాలని సి ఐ టి యు సంఘం నాయకత్వంలో ఆరోగ్యశాఖ మంత్రి, రాష్ట్ర ఉన్నాతాధికారులకు, ఎమ్మెల్యేలకు, మంత్రులకు, అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చిన సమస్యలు పరిష్కరించడంలేదని అన్నారు, ఎన్ హెచ్ ఎమ్ స్కీం లో భాగంగా గత 19 సంవత్సరాల నుండి రాష్ట్రంలో ఆశ వర్కర్లు పనిచేస్తున్నారని వీరంతా బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళలు, రాత్రనకా పగలనకా ఉదయం నుండి రాత్రి వరకు నిరంతరం ప్రజల ఆరోగ్య సేవలు అందిస్తూ డెలివరీల సందర్భంగా రెండు మూడు రోజులు కుటుంబాన్ని వదిలి వారితో పాటు హాస్పిటల్ వద్ద వారితో పాటు కలిసి ఉండ వలసి వస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఆశాలను ఎట్టి చేయించుకుంటుందని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం 45వ %×ూజ% సిఫారసులు మాత్రం అమలు చేయలేదని దీనివల్ల తెలంగాణలతో పాటు దేశవ్యాప్తంగా 10 లక్షల మంది ఆశలు నష్టపోతున్నారని, కరోనాకాలంలో ఆశల శ్రమను గుర్తించి డబ్ల్యూ హెచ్ గ్లోబల్ లీడర్స్ అని ఆశాలకు అవార్డును ప్రకటించింది, కానీ మన కేంద్ర ప్రభుత్వం నేటికీ ఆశల శ్రమను గుర్తించడానికి సిద్ధపడట్లేదు పైగా ఏనౌచ్యం స్కీంకు బడ్జెట్ ను తగ్గిస్తుంది, కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి సంగం పెట్టుకునే హక్కు సమ్మె చేసే హక్కు లేకుండా చేసి కార్మిక హక్కులను కాలరాస్తున్న, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని అందుకు వ్యతిరేకంగా నిర్వహించే ఆశ వర్కర్ల బస్సు జాతను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ సభ్యురాలు కోరె లలిత, మండల నాయకురాలు ఏద్దుల సునీత, గొల్ల బోయిన అండాలు, ఐటి పాముల విజయలక్ష్మి, సరిత, నీలిమ, అలివేలు, పద్మ, చెన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.




## బీరంగూడ కాకతీయ టెక్నో పాఠశాలలో ఘనంగా గణిత దినోత్సవం

**పాఠశాల ఆవరణలో గణిత పితమహుడు శ్రీనివాస రామానుజం జన్మదిన వేడుకలు**

**ప్రాజెక్టుల ప్రదర్శన తో అబ్బుర పరిచిన చిన్నారి విద్యార్థులు**

**విద్యార్థులకు అభినందనలు తెలిపిన పాఠశాల యాజమాన్యం**



**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి డిసెంబర్ 23 :** బీరంగూడ కాకతీయ టెక్నో పాఠశాలలో ఘనంగా గణితోత్సవ దినోత్సవం జరిగింది. పాఠశాల ఆవరణలో గణిత పితమహుడు శ్రీనివాస రామానుజం జన్మదిన వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన 1 నుండి 7 వ తరగతి తదివే చిన్నారి విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు చూపరులను అబ్బుర పరిచాయి. విద్యార్థులు గణితానికి సంబంధించిన ప్రాజెక్టులను ఎంతో చక్కగ ప్రదర్శించారు. చిన్నారుల ప్రదర్శనను చూసి వారి తల్లిదండ్రులు మరియు పాఠాశాల సిబ్బంది ఎంతో సంబురాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ సీతారామ రెడ్డి, వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, డైరెక్టర్ లక్ష్మారెడ్డి, ప్రదా నోపాధ్యాయుడు సతీష్ చంద్ర చిన్నారులకు అభినందనలు తెలిపారు. గణిత ఉపాధ్యాయురాల్లు సుష్మా, లతాంజలి, చెల్వి లు విద్యార్థులు ప్రాజెక్టు కొరకు సహాయ సహకారాలు అందిచారు. ఇంకా విద్యార్తినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లకు ట్రైనింగ్..!

**జగిత్యాలజిల్లా ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** జగిత్యాల ప్రాజెక్టు పరిధిలోని రూరల్, అర్బన్ మండల లోని అంగన్వాడి టీచర్లకు గంగపుత్ర సంఘం భవనం లో పోషణ ట్రాకర్ యాప్ పైన ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ఇందులో ముఖ్యంగా 7 నెలల నుండి 3సంవత్సరాల పిల్లలందరికీ ఆధార్ వెరిఫికేషన్, మొబైల్ వెరిఫికేషన్, ఫేస్ క్యాప్చర్, ఈ కెవైసి అందరికీ చెయ్యాలి అని చెప్పరు. మరియు ప్రతిరోజు పోషణ ట్రాకర్ యాప్ లో సెంటర్ ఓపెన్, బెనిఫిషరీ అటెండెన్స్, మార్నింగ్ స్నాక్స్, ఫోటో క్యాప్చర్ ఎంట్రీ చెయ్యాలి అని టీచర్లకు చెప్పడం జరిగింది. కొత్తగా వచ్చిన లబ్ధిదారుల రిజిస్ట్రేషన్, పిల్లలందరికీ గ్రోత్ మానిటరింగ్ డేటా ఎంట్రీ, హోమ్ విసిట్, %ఎనూచీణ, జదీజు% ఈవెంట్స్, గర్భవతులకు జెస్టేషనల్ వెయిట్ గెయిన్ ప్రతినెల ఎంట్రీ చెయ్యాలి అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో జగిత్యాల ప్రాజెక్టు సిడిపిఓ మమత, జగిత్యాల రూరల్, అర్బన్ సూపర్వైజర్ లు రాజశ్రీ, శ్రీలక్ష్మి, కవిత, లావణ్య, స్వరూప రాణి, కవిత రాణి, మరియు పోషణ అభియాన్ కోఆర్డినేటర్ లక్ష్మణ్, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు..



# ధ్యానం ద్వారా యువత దురలవాట్లను దూరం చేయొచ్చు: పిరమిడ్ మెడిటేషన్ ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్

**సత్యానికి అవసరమైన సూత్రాలను పత్రీజీ అందించారు: కడ్తాల్ మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ మెంబర్ దీప్తి నాగేళ్ల**

**మనలోనే దివ్య చైతన్య శక్తి ఉందని తెలుసుకోవాలి: ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ శ్రీధర్ రావు నల్లమోతు**

**పీఎంసీతో ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు ధ్యానం చేరువ: ముంబైకి చెందిన ఇన్ కమ్ టాక్స్ ఆఫీసర్ ఎస్ఈ.జైన్**







**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి(కడ్తాల్):** యువత దురలవాట్లకు బానిస అవుతుండడం పట్ల, చిన్న సమస్యలకే ఆత్మహత్యలకు పాల్పడుతుండడం పట్ల ఆందోళన కలిగిస్తుందని పీఎంసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్, అన్నారు. ధ్యానం ద్వారా యువత దురలవాట్లను దూరం చేయొచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం పత్రీజీ ధ్యాన మహా యాగంలో 3 వరోజు నిర్వహించిన ప్యానెల్ డిస్కషన్ లో పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఓయూ రాము, క్వాంటమ్ లైఫ్ యూనివర్శిటీ పవన్, గురుస్థాన్ వ్యవస్థాపకులు పేరం నాగేంద్ర పాల్గొని తమ సందేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ భవిష్యత్తులో యువత కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. అలాగే తమ ధ్యాన అనుభావాలను, బ్రహ్మర్షి పత్రీజీతో తమకు గల అనుభవాలను తెలియజేసారు. ఈ యాగంలో ట్రూత్ ఫర్ యూత్ అనే కార్యక్రమంలో భాగంగా సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఓయూ రాము, కడ్తాల్ మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ మెంబర్ దీప్తి నాగేళ్ల, మోటివేషనల్ స్పీకర్ శ్రీధర్ రావు నల్లమోతు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీప్తి నాగేళ్ల మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సత్యం అవసరమని, సత్యానికి అవసరమైన సూత్రాలను బ్రహ్మర్షి పత్రీజీ అందించారని తెలిపారు. మన తప్పులను ఇతరులపైకి నెట్టివేయకుండా మనమే బాధ్యత వహించాలన్నారు. మనలోనే దివ్య శక్తి, చైతన్య శక్తి ఉంది అని తెలుసుకోవడమే సత్యమని తెలిపారు. అనంతరం శ్రీధర్ నల్లమోతు మాట్లాడుతూ తాను ఆధ్యాత్మికత, ద్వైతం, అద్వైతం, సైన్, ధ్యానం ఇలా అనేక అంశాలపై పరిశోధనలు చేసానని తెలిపారు. మనుషులు ఈ క్షణంలో జీవించడం నేర్చుకోవాలని సూచించారు. అనంతమైన కోరికలు, ఇతరులతో పోల్చుకోవడం వల్లే ప్రశాంతగా ఉండలేకపోతున్నారని తెలిపారు. విశ్వం మనకు ప్రతి విషయంలో మార్గదర్శనం చేస్తుందని, మనకు అద్భుతమైన జ్ఞానాన్ని అందిస్తుందని వెల్లడించారు. మీ జీవితాలను విశ్వానికే అప్పజేప్పాలని సూచించారు. పిఎస్ఎస్ఎం తెలుగు రాష్ట్రాల జిల్లా అధ్యక్షులు తమ మాస్టర్లతో కలిసి విచ్చేసి తాము చేస్తున్న ధ్యాన, ఆత్మ జ్ఞాన కార్యక్రమాల గురించి తెలియజేసారు. ఖమ్మం సీనియర్ పిరమిడ్ మాస్టర్లు శైలజ ఇతర మాస్టర్లు-ఖమ్మం జిల్లాలో ధ్యానాన్ని విస్తరించేందుకు తాము చేస్తున్న కార్యక్రమాల గురించి తెలియజేసారు. అలాగే పెద్దపల్లి మాస్టర్లు దిలీశ్వర్ రెడ్డి, లావణ్యలు పెద్దపల్లి జిల్లాలోని పిరమిడ్ ల గురించి, తాము చేపట్టిన కార్యక్రమాలు, అలాగే తమ ధ్యాన అనుభవాల గురించి వివరించారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా పిరమిడ్ మాస్టర్ యాదవ్ గౌడ్ జిల్లాలో ధ్యానాన్ని అందిరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తాము చేస్తున్న కృషి గురించి వివరించారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ల సందేశ కార్యక్రమంలో ముంబైకి చెందిన ఇన్ కమ్ టాక్స్ ఆఫీసర్ ఎస్ ఈ జైన్ పాల్గొని నార్త్ ఇండియాలోని అన్ని ప్రాంతాల్లో ధ్యానాన్ని విస్తరించేందుకు తాము చేస్తున్నకార్యక్రమాల గురించి వివరించారు. అలాగే తాను ధ్యానంలోకి ఎందుకు వచ్చాననే విషయాల గురించి తెలియజేసారు. పీఎంసీ చానెల్ ద్వారా ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు ధ్యానాన్ని చేరువ చేసేందుకు పీఎంసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. యాగాన్ని అద్భుతంగా నిర్వహిస్తున్న పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డిని కొనియాడారు. అనంతరం ఆనంద్ మాట్లాడుతూ ఇన్ కమ్ టాక్స్ ఆఫీసర్ ఎస్ఈ జైన్ నార్త్ ఇండియాలో ధ్యాన విస్తరణకు చేస్తున్న కృషిని ప్రశంసించారు. అనంతరం విజయ భాస్కర్ రెడ్డి, మారం శివప్రసాద్ లు ఎస్ఈ జైన్ ను ఘనంగా సన్మానించారు. 225 గంటల నిరంతర అఖండ ధ్యానం కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుంది. ఆఖండ ధ్యానంలో ధ్యానులు, మాస్టర్లు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఎంతో శ్రద్దగా ధ్యానం చేసారు. యాగంలో సాంస్కృతిక కార్యక్రమాలు ధ్యానులకు అద్భుతమైన వినోదాన్ని అందిస్తున్నాయి. ఫైమా ఆంధ్రప్రదేశ్ కు చెందిన కూచిపూడి కళాకారిని ట్వింకిల్ సాయి హాసినీ కూచిపూడి నృత్యాన్ని అద్భుతంగా చేసి అలరించింది. అలాగే ఈశ్వరన్ బృందం ప్రదర్శించిన ఆట పాటలు, జిమ్నాస్టిక్ ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి. సోల్ కోచ్ ట్రైనర్ హరిక, స్పీకర్ హరీష్, ఆచార్య పవన్ కుమార్ పాల్గొని యువత ఎదుర్కోంటున్న సమస్యలు, పెళ్లి, రిలేషన్ షిప్ లపై యువతలో నెలకొన్న సందేహాలను నివృత్తి చేసారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలో ఫత్తేపూర్ వార్డు లోని అపోస్తులు ఫిలిప్పీ మినిస్ట్రీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సిస్టర్ ప్రేమీల మాట్లాడుతూ ప్రభు నందు విశ్వాసము గా ఉండాలని అన్నారు. వేడుకల సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రాస్టర్ సతీష్, సిస్టర్ శాంతి యువకులు తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.